www.asthram.com

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దినపత్రిక

మంగళవారం 28 అక్టోబర్ 2025

సంగారెడ్డి సంచిక :61 సంపుటి : 1 పేజీలు : 8 వెల : రూ. 5/-

## వొడాఫోన్ ఐడియాకు సుప్రీంలో భారీ ఊరట

సవరించిన స్థూల ఆదాయం (ఏజీఆర్) బకాయిల లెక్కింపు వ్యవహారంలో ప్రముఖ టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియాకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. 2016-17 వరకు బకాయిల కోసం టెలికాం విభాగం (డాట్) ఇచ్చిన అదనపు పన్ను డిమాండ్‌లపై కంపెనీ చేస్తోన్న అభ్యంతరాలను పరిశీలించేందుకు కేంద్రానికి అత్యున్నత న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. డాట్ తాజా పన్ను డిమాండ్‌ను రద్దు చేయాలని కోరుతూ వొడాఫోన్ ఐడియా వేసిన పిటిషన్‌పై కోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. 2016-17 కాలానికి అదనపు ఏజీఆర్ చెల్లించాల్సిందిగా డాట్ ఇటీవల కంపెనీకి నోటీసులు ఇచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ.. రూ.5,606 కోట్ల అదనపు పన్నును డిమాండ్ చేసింది.



## రెండేళ్లు అయిపోయాయి.. ఇంకో మూడేళ్లలో చేసేది ఏమీ ఉండదు

- కాంగ్రెస్ సర్కారుపై కేటీఆర్ సెటైర్లు..
- పొరపాట్లు చేసి ఉంటే చేసుండొచ్చు..
- తెలంగాణ బుల్డోజర్ రాజ్యంపై రాహుల్ ఎందుకు సైలెంట్‌గా ఉన్నడు?
- మోదీ చట్టాలను బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే.. రేవంత్ త్వరగా అమలు చేస్తడు

హైదరాబాద్

పెద్ద పెద్ద లీడర్లను తీసుకొచ్చికక్కడ కాంగ్రెస్ మైనార్టీ డిక్లరేషన్ ప్రకటించిందని.. మార్పు తెస్తాం అంటూ ప్రచారం చేసిందని కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రెండేళ్ల క్రితం మైనార్టీల కోసం 4వేల కోట్ల బడ్జెట్ పెడతామన్నారనని.. మైనార్టీ సబ్ ప్లాన్ కూడా తెస్తామని చెప్పి కాంగ్రెస్ మాట తప్పిందని.. రెండేళ్లు అయిపోయాయి.. ఇంకో - మిగతా 3లో

## రైతులకు నష్టం జరగకుండా పంటలు కొనుగోలు చేయాలి

- ధాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలి
- పత్తి అమ్మకాల విషయంలో రైతులు నాణ్యత, తేమ శాతాన్ని దృష్టిలో పెట్టుకోవాలి
- పత్తిలో తేమ 12 శాతానికి మించకుండా చూసుకోవాలి



హైదరాబాద్

తెలంగాణకు వర్ష సూచన దృష్ట్యా రైతులకు నష్టం కలగకుండా పంటలు కొనుగోలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ధాన్యం, పత్తి, మొక్కజొన్న కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సీఎం ఆదేశాలతో సాయంత్రం కలెక్టర్లతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. పంటల కొనుగోళ్లకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించనున్నారు.

పత్తి అమ్మకాల విషయంలో రైతులు నాణ్యత, తేమ శాతాన్ని దృష్టిలో పెట్టుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పత్తిలో తేమ 12 శాతానికి మించకుండా చూసుకోవాలని సూచించారు. అంతకు మించితే కనీస మద్దతు ధర పొందే అవకాశం ఉండదన్నారు. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశామని.. పత్తి రైతులకు గరిష్ఠ మద్దతు ధర అందించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు.




## 12 రాష్ట్రాలలో ఎస్ఐఆర్ రెండో దశను ప్రారంభిస్తాం

- కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్
- 1951నుంచి 2004 వరకు ఎనిమిది సార్లు ఎస్ఐఆర్ నిర్వహించారు
- 21ఏళ్ల తర్వాత మళ్లీ ఎస్ఐఆర్ విజయవంతంగా పూర్తి చేస్తున్నాం.
- బిహార్‌లో ఎస్ఐఆర్‌పై ఎవరు అభ్యంతరాలు చెప్పలేదు
- త్వరలో రెండో దశలో 12 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ నిర్వహిస్తాం.

## డిజిటల్ అరెస్ట్.. అత్యంత భయంకరమైన ముప్పు

- డిజిటల్ అరెస్టును ప్రజలకు ఉన్న అత్యంత భయంకరమైన ప్రమాదాల్లో ఒకటిగా
- ఇటువంటి వాటిని ఎదుర్కోవాలంటే సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు సరైన అవగాహన కల్పించాలి
- పోలీసుల పట్ల ప్రజలకు భయం ఉండకూడదని, వారు తమకు రక్షణగా నిలుస్తారనే గౌరవం ఉండాలి
- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ



## తెలంగాణలో గన్ కల్చర్ పెరుగుతోంది

- కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల కాళ్లు పట్టుకునే దుస్థితికి తీసుకొచ్చింది
- రైతులు పండించిన పంటను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలి
- జూబ్లీహిల్స్‌లో పోటీ మజ్లిస్- భాజపా మధ్యే
- "జూబ్లీహిల్స్‌లో మజ్లిస్-భాజపా మధ్యే పోటీ ఉంటుంది
- ప్రజలు భాజపాకు ఓటేయకుంటే మజ్లిస్ సీట్లు 8 అవుతాయి




## కొత్త సీజేఐగా సూర్యకాంత్



- తదుపరి సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ పేరును ప్రతిపాదించిన సీజేఐ బీఆర్ గవాయ్
- సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సూర్యకాంత్..
- 2001 మార్చిలో ఆయన సీనియర్ న్యాయవాదిగా నియమితులయ్యారు

## అన్ని అవసరాలకు డిజిటల్ పాసు పుస్తకం




- ప్రభుత్వ శాఖల్లో చెల్లుబాటు
- భూ భారతి సెక్షన్ 10 (6) కింద వెసులుబాటు
- ముద్రణకు సంబంధించిన సమస్యలతో పాసుపుస్తకాల పంపిణీలో జాప్యం

హైదరాబాద్

చేతిలో పట్టాదారు పాసుపుస్తకం లేదనే దిగులు అక్కర్లేదర్ని. ప్రభుత్వం నుంచి పాసుపుస్తకం అందకున్నా..అన్ని అవసరాలకు చెల్లుబాటయ్యే డిజిటల్ కాపీని పొందే వీలుందని అధికారులు సూచిస్తున్నారు. భూభారతి-2025(ఆర్వోఆర్) చట్టం ప్రకారం సెక్షన్-10లోని సబ్ సెక్షన్-6 ద్వారా డిజిటల్ కాపీ చెల్లుబాటు అవుతుందని పేర్కొంటున్నారు. ముద్రణకు సంబంధించిన సమస్యలతో పాసుపుస్తకాల పంపిణీలో జాప్యం జరుగుతోంది. చెన్నైకి చెందిన ఓ ముద్రణ సంస్థతో రెవెన్యూశాఖ పుస్తకాలను ముద్రించి.. తపాలాశాఖ ద్వారా బట్వాడా చేస్తోంది. ఈ ఏడాది జులైలో ముద్రణ సంస్థతో ఒప్పందం ముగిసింది. తర్వాత ఏ సంస్థతోనూ ఒప్పందం జరగలేదు. ఈ పరిణామాలతో ముద్రణ, పంపిణీ ఆలస్యమవుతున్న నేపథ్యంలో పోర్టల్‌లో డిజిటల్ సంతకం పూర్తయిన పాసు పుస్తకం డిజిటల్ కాపీని డౌన్‌లోడ్ చేసుకుని ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు - మిగతా 2లో



## నేడు, రేపు భారీ వర్షాలు

- రాష్ట్రంపై మొంథా తుపాను ప్రభావం
- ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ
- పంటల కొనుగోళ్లపై అప్రమత్తంగా ఉండాలి
- అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు

హైదరాబాద్

బంగాళాఖాతంలో ఏర్పడ్డ తీవ్ర వాయుగుండం మరింత బలపడి ఆదివారం రాత్రి తుపానుగా మారింది. ఈ తుపానుకు మొంథా అనే పేరు పెట్టినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నెల 28(మంగళవారం) ఉదయానికి ఇది తీవ్ర తుపానుగా - మిగతా 2లో

# కొత్త సీజేఐగా సూర్యకాంత్

**న్యూఢిల్లీ :** భారత సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ సూర్యకాంత్ పేరు ఖరారైంది. ప్రస్తుత సీజేఐ జస్టిస్ భూషణ్ ఆర్. గవాయ్.. తన వారసుడిగా జస్టిస్ సూర్యకాంత్ పేరును కేంద్ర ప్రభుత్వానికి సోమవారం సిఫారసు చేశారు. దీంతో దేశ 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియామకానికి మార్గం సుగమమైంది. జస్టిస్ గవాయ్ నవంబర్ 23న పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో తదుపరి సీజేఐ పేరును సూచించాలని కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ కోరిన మీదట జస్టిస్ గవాయ్ ఈ సిఫారసు చేశారు. సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సూర్యకాంత్.. నవంబర్ 24న నూతన సీజేఐగా ప్రమాణ స్వీకారం చేస్తారు. ఆయన 2027 ఫిబ్రవరి 9న పదవీ విరమణ చేసేంత వరకు, అంటే సుమారు 14 నెలల పాటు ఈ అత్యున్నత పదవిలో కొనసాగుతారు. 2025 మే నెలలో జస్టిస్ గవాయ్ 52వ సీజేఐగా బాధ్యతలు స్వీకరించారు. సంప్రదాయం ప్రకారం,



సీజేఐ పదవీ విరమణకు నెల రోజుల ముందు న్యాయ మంత్రిత్వ శాఖ తదుపరి వారసుడి పేరును సిఫారసు చేయాలని కోరుతుంది. మెమోరాండం ఆఫ్ ప్రొసీజర్ (ఎంఓపీ) ప్రకారం, సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తిని సీజేఐగా నియమిస్తారు. జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హర్యానాలోని ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. హిసార్‌లోని ప్రభుత్వ పోస్ట్ గ్రాడ్యుయేట్ కాలేజీ నుంచి 1981లో డిగ్రీ, రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీ నుంచి 1984లో న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. అదే ఏడాది హిసార్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా తన ప్రాక్టీసును ప్రారంభించారు. 1985లో చండీగఢ్‌కు మారి పంజాబ్, హర్యానా హైకోర్టులో ప్రాక్టీస్ చేశారు. 2000 జులై 7న హర్యానా రాష్ట్రానికి అత్యంత పిన్న వయస్కుడైన అడ్వొకేట్ జనరల్‌గా రికార్డు సృష్టించారు. 2004 జనవరి 9న పంజాబ్, హర్యానా హైకోర్టుకు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆ తర్వాత 2018 అక్టోబర్ 5న హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. జస్టిస్ గవాయ్ సిఫారసుతో కేంద్ర ప్రభుత్వం త్వరలోనే జస్టిస్ సూర్యకాంత్ నియామకంపై అధికారిక నోటిఫికేషన్ జారీ చేయనుంది.

## ఢిల్లీలో కొనసాగుతున్న వాయు కాలుష్యం..

# ఆసుపత్రుల్లో పెరిగిన రోగుల సంఖ్య

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ క్షీణిస్తోంది. గాలి నాణ్యత సూచీ ప్రమాదకరస్థాయిలో నమోదవుతోంది. సోమవారం ఉదయం ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో వాయు నాణ్యత సూచిక 315గా నమోదైంది.
సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న డేటా ప్రకారం.. అశోక్ విహార్‌లో అత్యధికంగా ఏక్యూఐ 416గా నమోదైంది. ఆ తర్వాత గౌతమ్ పురి వద్ద 415, ఆనంద్ విహార్ వద్ద 366గా గాలి నాణ్యత సూచీ ఉంది. గణేశ్‌పూర్ వద్ద 318, జీటీబీ నగర్‌లో 302, కశ్మీర్ గేట్ ఐఎస్‌బీటీ ప్రాంతంలో 298, యమూర్ విహార్‌లో 287గా ఏక్యూఐ నమోదైంది. ఇవాళ ఢిల్లీలో గరిష్ట ఉష్ణోగ్రతలు 29ీ%జ-31ీజ%గా, కనిష్ట ఉష్ణోగ్రతలు 17ీ%జ-19ీజ%గా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా. రాత్రికి ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటి వర్షం పడే అవకాశం ఉందని ఢిల్లీ ఆర్‌ఎమ్‌సీ అంచనా వేసింది. తీవ్రమైన వాయుకాలుష్యంతో ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యం బారిన పడుతున్నారు. ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్, ఫరీదాబాద్, ఘజియాబాద్‌లోని ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. శ్వాసకోశ, ఛాతీలో నొప్పి, దగ్గు, గొంతు నొప్పి వంటి సమస్యలతో స్థానికులు ఆసుపత్రులకు వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం.. గాలి నాణ్యత 447కు పడిపోవడం అంటే దాన్ని తీవ్ర వాయు కాలుష్యంగా పరిగణించవచ్చు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 0-100 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉండి, కాలుష్యం లేదని, %ూూ×% 100-200 మధ్య ఉంటే గాలి నాణ్యత మధ్యస్తంగా ఉందని అర్థం. ఇక %ూూ×% 200-300 మధ్య ఉంటే గాలి నాణ్యత



అధ్వాన్నంగా ఉందని, %ూూ×% 300-400 మధ్య ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వాన్నంగా ఉందని, %ూూ×% 400-500 మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉందని అర్థం చేసుకోవచ్చు.

**ఈ నెల 29న కృత్రిమ వర్షం**

ఈ నెల 29న ఢిల్లీలో మొదటిసారిగా కృత్రిమ వర్షాన్ని కురిపించేందుకు ఏర్పాట్లు చేశామని సీఎం రేఖా గుప్తా వెల్లడించారు. బురాయ్‌లో ప్రయోగాత్మక పరీక్ష విజయవంతమైందన్నారు. ఐఐటీ-కాన్పూర్ సహకారంతో ఢిల్లీ ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్ట్‌కు ఐఎండీ, ఐఐటీఎమ్-పుణె తోడ్పాటును అందిస్తున్నాయి. దీపావళి తర్వాత పొగ మంచు సీజన్‌లో కాలుష్య కణాలను తగ్గించడానికి వాయువ్య ఢిల్లీలో అయిదు చోట్ల ఈ కృత్రిమ వర్షం కురిపించనున్నారు. ఇందుకోసం డీజీసీపీ అనుమతి పొందారు. సిల్వర్ అయోడైడ్ లేదా సోడియం క్లోరైడ్ లాంటి పదార్థాలను మేఘాల్లోకి విడుదల చేయడం ద్వారా కృత్రిమ వర్షాన్ని కురిపిస్తారు. ఈ వర్షం కారణంగా రాజధాని ప్రాంతంలో గాలి నాణ్యత మెరుగుపడే అవకాశం ఉంది.

# పాక్-అఫ్ఘాన్ ఘర్షణలు.. శాంతి చర్చల్లో ప్రతిష్టంభన

సరిహద్దు వెంబడి ఉగ్రవాద చర్యలకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో పాకిస్థాన్-అఫ్ఘానిస్థాన్ ల మధ్య కొనసాగుతోన్న చర్చల్లో ప్రతిష్టంభన నెలకొంది. భద్రతాపరంగా కీలకమైన అంశాల్లో తాలిబన్ అసంబద్ధంగా వ్యవహరిస్తోందని పాక్ ఆరోపించింది. పాక్-అఫ్ఘాన్‌ల మధ్య దీర్ఘకాలిక శాంతి ఒప్పందం కోసం ఈ రెండు దేశాల మధ్య తుర్కియేలోని ఇస్తాంబుల్‌లో రెండోదశ చర్చలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. అయితే ఇరువర్గాల మధ్య సంధి కుదరకపోవడంతో ఈ చర్చలు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. ఇస్తాంబుల్‌లో ఈ చర్చలు జరుగుతోన్న సమయంలోనే పాక్-అఫ్ఘాన్ సరిహద్దు మరోసారి భగ్గుమంది. ఆదివారం చోటుచేసుకున్న ఘర్షణల్లో ఐదుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు పాక్ సైన్యం వెల్లడించింది. మరోవైపు అఫ్ఘాన్ సరిహద్దు నుంచి తమ దేశంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించిన 25 మంది ఉగ్రవాదులను కాల్చిచంపినట్లు పాక్ తెలిపింది. వారిలో నలుగురు ఆత్మాహుతి బాంబర్లు ఉన్నారని పేర్కొంది. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ఈ చొరబాటు యత్నాలు జరిగాయని వివరించింది. వీటిని నిరోధించే లక్ష్యంతో జరిపిన ఆపరేషన్లలో భద్రతా దళాలు పెద్ద మొత్తంలో ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నాయి.

**కరాచీ, లాహోర్‌లకు విమాన మార్గాల్లో పాక్ మార్పులు**

ఈ చొరబాట్లతో ఉగ్రవాదాన్ని కట్టడి చేసే విషయంలో అఫ్ఘాన్



తీసుకుంటున్న చర్యలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పాక్ ఆరోపించింది. అయితే ఈ వ్యాఖ్యలపై తాలిబన్ ప్రభుత్వం నుంచి స్పందన రాలేదు. కాగా.. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్నారంటూ పాక్ చేస్తోన్న ఆరోపణలను అఫ్ఘాన్ ముందు నుంచి ఖండిస్తోంది. అలాగే తమ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించేలా పాక్ సైన్యం తీసుకుంటున్న చర్యలను తప్పుపట్టింది.

# రిసార్టులో కరూర్ బాధిత కుటుంబాలకు విజయ్ ఓదార్పు

తమిళ అగ్రనటుడు, టీవీకే అధినేత విజయ్ ఎట్టకేలకు కరూర్ బాధిత కుటుంబాలను కలుసుకున్నారు. సోమవారం మహాబలిపురంలోని ఓ రిసార్ట్‌లో వాళ్లను పరామర్శించి.. ఓదార్చి.. పరిహారం అందజేశారు. ఈ నేపథ్యంతో ఆ పరిసర ప్రాంతాల్లో గట్టి భద్రతను ఏర్పాటు చేశారు. కరూర్ తొక్కిసలాటకు నేటితో సరిగ్గా నెల రోజులు పూర్తైంది. సెప్టెంబర్ 27వ తేదీన టీవీకే ర్యాలీ సందర్భంగా తొక్కిసలాట జరిగి 41 మంది మరణించారు. ఈ ఘటన తీవ్ర విచారం వ్యక్తం చేసిన విజయ్.. బాధిత కుటుంబాలకు టీవీకే తరఫున పరిహారం కూడా ప్రకటించారు. అయితే అప్పటి నుంచి కరూర్ వెళ్లేందుకు ఆయనకు పోలీసుల నుంచి అనుమతి లభించడం లేదు. దీంతో.. దీంతో బాధిత కుటుంబాలనే



మహాబలిపురంలోని ఓ రిసార్ట్‌కు రప్పించారు. బాధిత కుటుంబాల కోసం రిసార్ట్‌లో టీవీకే పార్టీ 50 గదులను బుక్ చేసింది. వాళ్లందరినీ విడివిడిగా కలిసి విజయ్ పరిహారం అందిస్తున్నారు. కరూర్‌లో విజయ్ నిర్వహించిన ర్యాలీలో జరిగిన తొక్కిసలాట దేశవ్యాప్తంగా దిగ్భ్రాంతికి గురిచేసింది ఈ ఘటనకు సంబంధించి టీవీకేకు సంబంధించిన కొందరిని పోలీసులు అరెస్టు చేశారు. తొక్కిసలాట ఘటనలో కుట్ర కోణం ఉందని ఆరోపిస్తూ.. స్వతంత్ర దర్యాప్తు కోరుతూ విజయ్ పార్టీ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. దీన్ని తొలుత వ్యతిరేకించిన న్యాయస్థానం.. ఆ తర్వాత సిట్ దర్యాప్తునకు ఆదేశించింది. అటుపై సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తు చేస్తుండగా, రిటైర్డ్ సుప్రీం కోర్టు జడ్జి పర్యవేక్షణ కమిటీ ఆ దర్యాప్తును ఎప్పటికప్పుడు సమీక్షించనుంది. ప్రామాణిక నిర్వహణ విధాన నిబంధనలు రూపొందించేవరకు హైవేలపై ఏ రాజకీయ పార్టీ సభలకు పోలీసులు అనుమతివ్వరని తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికలు జరగాల్సి ఉంది.

## 12 రాష్ట్రాలలో ఎస్ఐఆర్ రెండో దశను ప్రారంభిస్తాం




**న్యూఢిల్లీ:** దేశ వ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటిగ్రేటెడ్ రివిజన్ - ఎస్ఐఆర్) ఫేజ్‌వన్ విజయవంతంగా ముగిసిందని కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ తెలిపారు. సోమవారం(సెప్టెంబర్ 27) కేంద్రం ఎన్నికల సంఘం మీడియా సమావేశంలో ఎస్ఐఆర్ మాట్లాడారు. 1951నుంచి 2004 వరకు ఎనిమిది సార్లు ఎస్ఐఆర్ నిర్వహించారు. 21ఏళ్ల తర్వాత మళ్లీ ఎస్ఐఆర్ విజయవంతంగా పూర్తి చేస్తున్నాం. బిహార్‌లో 7.5కోట్ల మంది ఎస్ఐఆర్ విజయవంతంగా పూర్తయ్యింది. బిహార్‌లో ఎస్ఐఆర్‌పై ఎవరు అభ్యంతరాలు చెప్పలేదు. త్వరలో రెండో దశలో 12 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ నిర్వహిస్తాం. ఈరోజు అర్ధరాత్రి తర్వాత ఓటర్ల జాబితా లాక్ చేస్తాం. ప్రతి ఇంటికి మూడుసార్లు బిఎల్ఓ విజిట్ చేస్తారు. బీఎల్ఓ ఇచ్చే ఎన్యుమరేషన్ ఫాంలో వివరాలు నమోదు చేసి సంతకం చేయాలి. 2003లో ఎవరితో ఉన్నామని లింక్ వివరాలు నమోదు చేయాలి. ఎన్యుమరేషన్ ఫామ్‌లో మ్యాచింగ్ , లింకింగ్ ప్రధానం. ఎన్యుమరేషన్ ఫాం రిటర్న్ చేసిన వారినే ఓటర్ జాబితాలో నమోదు చేస్తారు. బూత్ లెవెల్ ఏజెంట్లు 50 ఫారంలు ఎన్నికల సంఘానికి అందజేయవచ్చు. అన్ని ఎన్యుమరేషన్ ఫారంలు వచ్చిన తర్వాత ముసాయిదా ఓటర్ జాబితా విడుదల చేస్తాం'అని తెలిపారు. ఇందులో భాగంగా నవంబర్ 4 నుంచి డిసెంబర్ 4 వరకు ఎస్ఐఆర్. డిసెంబర్ 9న ముసాయిదా జాబితా విడుదల. డిసెంబర్ 9 నుంచి 8 జనవరి వరకు అభ్యంతరాల స్వీకరణ. డిసెంబర్ 9 నుంచి జనవరి 31 వరకు హియరింగ్ ,వెరిఫికేషన్ ఫిబ్రవరి 7న ఓటర్ల తుది జాబితా విడుదల ఉంటుందని వెల్లడించారు.

## డిజిటల్ అరెస్ట్..అత్యంత భయంకరమైన ముప్పు



**ఢిల్లీ:** డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరగాళ్లు ప్రజలను బెదిరింపులకు గురి చేస్తూ..భారీ మొత్తంలో డబ్బును కాజేస్తుండడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆందోళన వ్యక్తం చేశారు. డిజిటల్ అరెస్టును ప్రజలకు ఉన్న అత్యంత భయంకరమైన ప్రమాదాల్లో ఒకటిగా పేర్కొన్నారు. ఇటువంటి వాటిని ఎదుర్కోవాలంటే సైబర్ నేరాలపై ప్రజలకు పోలీసులు సరైన అవగాహన కల్పించాలన్నారు. పోలీసుల పట్ల ప్రజలకు భయం ఉండకూడదని, వారు తమకు రక్షణగా నిలుస్తారనే గౌరవం ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్రపతి భవన్‌లో ప్రొబేషనరీ ఐపీఎస్‌లను ఉద్దేశించి ప్రసంగించిన ముర్ము ఈ వ్యాఖ్యలు చేశారు. సైబర్ నేరగాళ్లు వీడియో కాల్స్ చేసి..తాము పోలీసులమని బెదిరిస్తారని.. తాము చెప్పినట్లు చేయకపోతే డిజిటల్ అరెస్టు చేస్తామని భయపెడతారని ద్రౌపదీ ముర్ము అన్నారు. ఇటువంటి సమయాల్లో ప్రజలు చాకచక్యంగా వ్యవహరించి పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ డిజిటల్ అరెస్టు ప్రభావం పోలీసు వ్యవస్థపైనా అధికంగా ఉంటుందన్నారు. సైబర్ నేరగాళ్లు పోలీసుల మాదిరి ప్రజలను నమ్మించి మోసం చేయడంతో.. అసలైన పోలీసులు ఎవరనే విషయాన్ని కూడా వారు గ్రహించలేకపోతారన్నారు. దీనిని నివారించాలంటే సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, పోలీసులు నూతన సాంకేతికతపైనా పట్టు సాధించాలని సూచించారు.

## 'దేశం పరువు తీశారు..' రాష్ట్రాలపై సుప్రీం కోర్టు ఆ?గ్రహం



వీధి కుక్కల వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. రాష్ట్రాలపై సోమవారం సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ ఉత్తర్వులను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యాయని.. తద్వారా అంతర్జాతీయ స్థాయిలో దేశం పరువు తీశారంటూ తీవ్ర వ్యాఖ్యలే చేసింది. వీధి కుక్కల నియంత్రణకు ఆగస్టులో సుప్రీం కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. షెల్టర్ల ఏర్పాటు అంశం పరిశీలన నేపథ్యంలో.. శునకాలను పట్టుకుని, శస్త్రచికిత్స చేసి, తిరిగి వదిలే విధానాన్ని అమలు చేయాలని ఆగష్టు నెలలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆదేశించింది. ఈ మేరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేస్తూ అఫిడవిట్లు దాఖలు చేయాలని రాష్ట్రాలకు సూచించింది. కానీ ఇప్పటివరకు పశ్చిమ బెంగాల్, తెలంగాణ, ఢిల్లీ ప్రభుత్వాలు మాత్రమే స్పందించాయి. అవి కూడా దీపావళి సెలవుల్లో అఫిడవిట్లు సమర్పించడంతో రికార్డుల్లో అధికారికంగా నమోదు కాలేదు. ఈ పరిణామంపై సోమవారం విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రెండు నెలలు గడిచినా, ఇంకా స్పందన లేదు. దీని అర్థం ఏంటి?. మీరు స్పందించకపోవడంతో.. ప్రపంచస్థాయిలో దేశం పరువును మీరే తీస్తున్నారు. ఇది సిగ్గు చేటు.. అంటూ రాష్ట్రాలపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో.. నవంబర్ 3న అన్ని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది. అయితే.. తెలంగాణ, పశ్చిమ బెంగాల్ సీఎస్‌లకు మాత్రం మినహాయింపు ఇచ్చింది. తమ ఆదేశాల తర్వాత కూడా దేశవ్యాప్తంగా వీధి కుక్కల దాడుల ఘటనలు నమోదు చేసుకున్నాయని కోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. ప్రజల భద్రతను నిర్లక్ష్యం చేయడం సర్వసాధారణమైన విషయం కాదంటూ రాష్ట్రాలను ఉద్దేశించి కోర్టు స్పష్టం చేసింది. తాజా వ్యాఖ్యల నేపథ్యంతో.. వచ్చే సోమవారం జరిగే విచారణ కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది.

# రెండేళ్లు అయిపోయాయి.. ఇంకో మూడేళ్లలో చేసేది ఏమీ ఉండదు

-మొదటిపేజీ తరువాయి

మూడేళ్లలో కూడా వీళ్లు చేసేది ఏమీ ఉండదని కేటీఆర్ విమర్శించారు. శంషాబాద్‌లో బీఆర్ఎస్ మైనార్టీ నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ షాదీ ముబారక్ వంటి పథకాన్ని ప్రవేశపెట్టారు.. షాదీ ముబారక్ కింద రూ.లక్ష ఇస్తే.. మేం అంతకంటే ఎక్కువ ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని.. మైనార్టీలను కాంగ్రెస్ ఓటు బ్యాంక్‌కుగా చూస్తోందని ఆరోపించారు.

**పొరపాట్లు చేసి ఉంటే చేసుండొచ్చు..**

మైనార్టీ స్కూళ్లను కేసీఆర్ ప్రారంభించారని.. మైనార్టీ స్కూల్స్‌తో ఎంతో మంది విద్యార్థులు డాక్టర్లు అవుతున్నారన్నారు. నాలుగు ఉన్న మెడికల్ కాలేజీలు కేసీఆర్ 34కు పెంచారాని.. విద్యార్థులకు 20 లక్షల స్కాలర్‌షిప్ ఇచ్చారని.. పదేళ్లలో ఎన్నో పనులు చేశారన్నారు. మేం కూడా కొన్ని కొన్ని పొరపాట్లు చేసి ఉంటే చేసుండొచ్చని.. కానీ.. ఇండియాలో మైనార్టీలకు కేసీఆర్ చేసినన్ని పనులు ఇంకెవరూ చేయలేదన్నారు. తెలంగాణలో 45 లక్షల మంది ముస్లింలు ఉన్నారని.. కేసీఆర్ హయాంలో ఒక్కొక్కరిపై రూ.5వేల ఖర్చు చేశారని. ఇది అన్ని రాష్ట్రాల కంటే చాలా ఎక్కువ అని తెలిపారు. మైనార్టీల సంక్షేమం కోసం అత్యధికంగా ఖర్చు చేసింది కేసీఆరేనని.. ఈ విషయాన్ని ఇతర రాష్ట్రాల్లో అసదుద్దీన్ ఒవైసీ కూడా చెప్పారు.. కానీ ఇక్కడ చెప్పరన్నారు.

**తెలంగాణ బుల్డోజర్ రాజ్యంపై రాహుల్ ఎందుకు సెలైంట్‌గా ఉన్నడు?**

బుల్డోజర్ రాజ్యం నడవదని యూపీపై రాహుల్ గాంధీ విమర్శించారని.. ఇక్కడ అదే బుల్డోజర్ రాజ్యం నడుస్తుంటే రాహుల్ గాంధీ ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని కేటీఆర్ ప్రశ్నించారు. హైడ్రాపై రాహుల్ గాంధీ సైలెంట్‌గా ఉన్నారని.. రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తో పాటు మరో తొమ్మిది మంది ఎమ్మెల్యే పార్టీ మారారని.. మీరు ఏ పార్టీలో ఉన్నారని వారిని అడగండి.. వాళ్లు సమాధానం చెప్పలేదన్నారు. ఇదే విషయంపై ఒకసారి జర్నలిస్టు కడియం శ్రీహరిని ప్రశ్నిస్తే.. ఎక్కడ ఉండాలో అక్కడే ఉన్నా అని సమాధానం చెప్పారు.. ఇది వాళ్ల పరిస్థితి అంటూ గుర్తు చేశారు. సీఎం అవుతానని రేవంత్ రెడ్డి కూడా అనుకోలేదని.. ఒక యువకుడు మంచి రీల్ చేశాడని.. ఈ రెండేళ్లలో రేవంత్ రెడ్డి ఏం చేశారని అడిగితే.. ఆయన చేసింది ఒక్కటే కేసీఆర్ పేరు తీయడం.. కేసీఆర్‌ను గుర్తు చేసుకోవడం అంతేనన్నారు.



**బహిరంగంగానే చెబుతున్నడు..**

మోదీ స్కూల్లో చదివానని.. చంద్రబాబు కాలేజీకి వెళ్లానని.. రాహుల్ దగ్గర ఉద్యోగం చేస్తున్నానని రేవంత్ బహిరంగంగానే చెబుతున్నారని.. చౌకీదార్ చోర్ అని రాహుల్ అంటే.. రేవంత్ రెడ్డి కాదు కాదు.. ఆయన నా పెద్దన్న అని చెబుతున్నాడన్నారు. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలు మోదీ జేబు సంస్థలు అని విమర్శిస్తే.. రేవంత్ రెడ్డి మాత్రం కాళేశ్వరం కేసు సీబీఐకి అప్పగిస్తారని.. ఒక సంవత్సరం క్రితం పొంగులేటి ఇంటిపై ఈడీకి రైడ్స్ అయ్యాయని.. ఒకటి కాదు రెండు రోజులు రైడ్స్ అయ్యాయని గుర్తు చేశారు. నోట్లు లెక్కపెట్టే మెషిన్‌లను లోపలికి తీసుకెళ్లిన దృశ్యాలు అంతా చూశారని. అంత జరిగిన తర్వాత ఏమైంది.. ఏమీ కాలేదు.. అంతా సైలెంట్ అంటూ విమర్శించారు. రేవంత్ రెడ్డి బంధువుకు కేంద్రంలో కాంట్రాక్టులు వస్తాచయని.. బదులుగా రేవంత్ రెడ్డి కూడా బీజేపీ నేతకు లాభం చేకూరుస్తారనవి ఆరోపించారు.

**మోదీ చట్టాలను బీజేపీ పాలిత రాష్ట్రాల కంటే.. రేవంత్ త్వరగా అమలు చేస్తడు : కేటీఆర్**

కేంద్రంలోని మోదీ సర్కారు తెచ్చిన చట్టాలను బీజేపీ పాలిత రాష్ట్రాలకంటే త్వరగా తెలంగాణలో రేవంత్‌రెడ్డి అమలు చేస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బడే భాయ్ కోసం రేవంత్ రెడ్డి చేసిన పని ఇదేనని.. ఇక్కడ నడుస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదు.. కాంగ్రెస్–బీజేపీ కలిసి నడిపిస్తున్న ప్రభుత్వం ఇది అంటూ విమర్శించారు. శంషాబాద్‌లో బీఆర్ఎస్ మైనార్టీ నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. ఆరు గ్యారెంటీలు వంద గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పారని.. తులం బంగారం ఇస్తాం.. యువతులకు రూ.2500 ఇస్తాం.. వృద్ధులకు రూ.4వేలు పెన్షన్ ఇస్తామని అరచేతిలో స్వర్గం చూపించారని విమర్శించారు.

అదేదో సినిమాలో కోడిని వేలాడదీసి దాన్నే చికెన్ అనుకోమన్నట్లు.. ఇక్కడ కూడా అన్ని చెప్పారని.. కానీ ఒక్కటి కూడా అమలు చేయట్లేదని విమర్శించారు. మైనార్టీ విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తామని చెప్పి కాంగ్రెస్ మాట తప్పిందని.. కేసీఆర్ ఇచ్చిన పథకాలను కూడా ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసిందని మండిపడ్డారు. 2018లో ఎన్నికలు గెలిచిన తర్వాత మహమూద్ అలీని కేసీఆర్ డిప్యూటీ సీఎంని చేశారని.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క మైనార్టీ ఎమ్మెల్యే కానీ, ఎమ్మెల్సీ కానీ లేరని.. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలోనైనా ఒక్క మైనార్టీ లీడర్‌ను కూడా ఎన్నుకోలేదని ధ్వజమెత్తారు. షబ్బీర్ అలీ, అజారుద్దీన్ లాంటి వారు కూడా కాంగ్రెస్‌కు కనిపించట్లేదా..? అంటూ నిలదీశారు.

ఎమ్మెల్సీ ఇచ్చినట్లే ఇచ్చి అజారుద్దీన్‌ను పక్కన పెట్టేశారని.. క్రికెట్‌లో అజారుద్దీన్ కట్ షాట్‌లు కొడితే.. ఇక్కడ అజారుద్దీన్‌నే రేవంత్ రెడ్డి కట్ చేసేశారని.. రెండేళ్లలో ఏం చేశారని నిలదీస్తే వాళ్లు చెప్పేది ఒక్కటే ఒక్కటి.. అది ఫ్రీ బస్ మాత్రమేనన్నారు. మహిళలకు ఫ్రీ బస్ అంటారు.. పురుషులకు టికెట్ రేట్ డబుల్ చేశారని ఆరోపించారు. ఇలాంటి మైనార్టీ సమావేశాలు ప్రతి జిల్లాలో జరగాల్సిన అవసరం ఉందని.. తెలంగాణలో కేసీఆర్ మరోసారి రావాల్సిన అవసరం ఉందన్నారు. నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు జరుగనున్నాయని.. కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు మైనార్టీలంతా కలిసి రావాలని కోరారు. జూబ్లీహిల్స్‌లో గెలుపు ఖాయమైందని.. కాని మెజార్టీ ఎంత అన్నదే తేలాలన్నారు.

# రేవంత్ రెడ్డి.. ఆటో డ్రైవర్లు అంటే ఎందుకు అంత చిన్న చూపు




**హైదరాబాద్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్ల పరిస్థితి పూర్తి అధ్వానంగా తయారైందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. అధికారంలోకి వచ్చి రెండేండ్లయినా ఆటో కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ రేవంత్ రెడ్డి అమలు చేయలేదని మండిపడ్డారు. ఆటో కార్మికులకు బాకీ పడిన రూ.24 వేలు ఎంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడిస్తేనే హామీని నెరవేరుస్తారని చెప్పారు. కోకాపేటలోని తన నివాసం నుంచి ఎర్రగడ్డకు, అక్కడి నుంచి తెలంగాణ భవన్ వరకు హరీశ్ రావు ఆటోలో ప్రయాణించారు. అనంతరం మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు ఆందోళనలో ఉన్నారు. రైతులు, చిరు ఉద్యోగులు, మహిళలు, ఆటో డ్రైవర్లు కావచ్చు.. అందరూ ఆవేదనలో ఉన్నారు. ఆటో డ్రైవర్ల పరిస్థితి మరీ ఆందోళనకరంగా ఉంది. పేరుకి ఉచిత బస్సు అన్నారు, మహిళలకు ఫ్రీ అన్నారు. మొగోళ్ళకి డబల్ టికెట్ కొడుతున్నారు. టికెట్ రేట్లు పెంచి కుటుంబం మీద భారం వేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఐదుసార్లు బస్ చార్జీలు పెంచింది. రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారంలో హైదరాబాద్‌కి వచ్చి సినిమా నటులకంటే ఎక్కువ యాక్టింగ్ చేశారు. చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీలో మెట్ల మీద కూర్చొని కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మొదటి ఏడాది 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేశారు. నిరుద్యోగులను వాడుకొని ఓట్లు, డబ్బులు తీసుకొని.. నిరుద్యోగ యువతీ యువకులను వదిలేశారు. నాడు రాహుల్ గాంధీ హైదరాబాద్ వచ్చి ఇదే యూసఫ్‌గూడా జూబ్లీహిల్స్‌లో ఆటో ఎక్కి ఆటో కార్మికులకు అరచేతిలో వైకుంఠం చూపించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.12 వేలు ఇస్తామని చెప్పారు. ఆటోనగర్, ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. ఆటోనగర్ అసలే లేదు. ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంచుతామని పత్తా లేదు. ఇస్తామన్న రూ.12 వేలకి దిక్కు లేదు. రాష్ట్రంలో ఉన్న 5 నుంచి 6 లక్షల ఆటోలకు కాంగ్రెస్ పార్టీ ఒక్కొక్క ఆటోకు రూ.24 వేలు బాకీ పడింది. ఆ మొత్తాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు వాటాల కోసం తన్నుకుంటున్నారు. వాటికోసం పైసలు ఉన్నాయి. కానీ ఆటో కార్మికులకు నెలకు రూ.1000 ఇవ్వడానికి లేవా?. రేవంత్ రెడ్డి నెల నెల మూటలు మోస్తూ ఢిల్లీకి కప్పం కడుతున్నాడు. ఆటో డ్రైవర్లు అంటే ఎందుకు అంత చిన్న చూపు. లక్ష కోట్లతో మూసీ సుందరీకరణ చేస్తున్నాం, లక్ష కోట్లతో ఫోర్త్ సిటీ నిర్మిస్తానంటున్నావు. కానీ ఆటో డ్రైవర్లకు నెలకు రూ.1000 ఇవ్వలేవా రేవంత్ రెడ్డి?. రాహుల్ గాంధీ.. ఓట్ల కోసం ఆటో ఎక్కి తిరిగావు. ఇప్పుడు ఆటో కార్మికుల కష్టాలు పట్టవా?. మరోసారి రాహుల్ గాంధీ హైదరాబాద్ వస్తే శంషాబాద్‌లో ఆటోలతో నిరసన తెలుపుతాం. రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆటో కార్మికుల బాధ తెలవాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఆటోల నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. వెంటనే బాకీ పడ్డ రూ.24 వేలు ప్రతి ఆటో డ్రైవర్‌కి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. మొత్తం ఆటో కార్మికులకు రెండేండ్ల బాకీ చెల్లించినా రూ.1500 కోట్లు అవుతుంది. రూ.3 లక్షలు ఫీజు పెంచితే మద్యం టెండర్లపై రూ.3 వేల కోట్లు ప్రభుత్వానికి వచ్చాయి. అందులో నుంచి రూ.1500 కోట్లు ఆటో కార్మికులకు ఇచ్చి వారిని కాపాడాలని డిమాండ్ చేస్తున్నాం. ఇప్పటివరకు 161 మంది ఆటో కార్మికులు చనిపోయారు. ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయి. చనిపోయిన ఆటో డ్రైవర్ కుటుంబానికి ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలి. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేస్తాం. ఆటో కార్మికులు ఎవరూ చనిపోవద్దని విజ్ఞప్తి చేస్తున్నా. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. తప్పకుండా మిమ్మల్ని కాపాడుకుంటాం. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఆటో కార్మికులు ఎక్కడ ఉన్నా కాంగ్రెస్‌ని ఓడించేలా పనిచేయండి. ప్రతి ఆటో అన్న రెండు ఫోన్లు చేసి మీ బంధుమిత్రులకు జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌కి ఓటు వేయాలని చెప్పండి. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ ఓడిపోతే కనీసం రేవంత్ రెడ్డికి బుద్ధి వస్తుంది. ఆటో కార్మికులకు ఇస్తానన్న హామీలు నెరవేరుస్తాడు. రేవంత్ రెడ్డి గురువు ఆంధ్రప్రదేశ్‌లో ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఇస్తున్నారు. రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లందరికీ బీఆర్ఎస్ పార్టీ మద్దతుగా ఉంది. అసెంబ్లీలో ఆటో డ్రైవర్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేసి అసెంబ్లీని స్తంభింపజేస్తాం. కేసీఆర్ మళ్ళీ వస్తారు. ఆటో డ్రైవర్ల కష్టాలు తీరుస్తారు.' అని హరీశ్ రావు అన్నారు

# తెలుగు టెక్ ట్యూట్స్..

**కరీంనగర్ :** తెలంగాణ రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లాకు చెందిన ఒక యువకుడు తన సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ కంటెంట్ క్రియేషన్ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని పొందారు. గోదావరిఖనిలోని యైటింక్లైన్ కాలనీకి చెందిన సయ్యద్ హఫీజ్ కు ఏకంగా యూఏఈ గోల్డెన్ వీసా లభించింది. సింగరేణి కార్మికుడి కుటుంబం నుంచి వచ్చి, ఉన్నత విద్య చదవకపోయినా.. తన సొంత టాలెంట్ తో ఈ స్థాయికి ఎదగడం తెలంగాణ వాసులకు గర్వకారణంగా నిలిచింది. హఫీజ్ 2011లోనే 'తెలుగు టెక్ ట్యూట్స్' పేరుతో తన యూట్యూబ్ ఛానెల్‌ను ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ సుపరిచితులైన హఫీజ్.. తన వీడియోల ద్వారా డిజిటల్ స్టార్‌గా ఎదిగారు. ప్రధానంగా మొబైల్ ఫోన్లు, టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్ల గురించి సమగ్రంగా వివరిస్తారు. కొత్త ఫోన్ల అన్‌బాక్సింగ్ .. వాటి ప్రత్యేకతలు, లాభనష్టాలు, అప్‌డేట్స్‌లోని పాజిటివ్, నెగటివ్ అంశాలను ప్రజల ముందు ఆవిష్కరిస్తారు.సుమారు 1.8 మిలియన్లకు (1.79 మిలియన్లు) పైగా సబ్‌స్క్రైబర్లు కలిగి ఉన్న ఈ ఛానెల్ ద్వారా హఫీజ్ 4.2 వేలకు పైగా వీడియోలను అందించి మన్ననలు పొందారు. ప్రస్తుతం యూట్యూబ్ ద్వారా ఆయన నెలకు రూ. 2 లక్షలకు పైగా ఆదాయాన్ని పొందుతున్నారు. హఫీజ్ డిజిటల్ ప్రయాణం కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాలేదు. 2022లో ఫోర్బ్స్ ఇండియా ప్రకటించిన టాప్ 100 డిజిటల్ స్టార్స్ జాబితాలో సయ్యద్ హఫీజ్ 32వ స్థానంలో నిలిచారు. తెలుగు ప్రజలను ఆయన వీడియోలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయని ఫోర్బ్స్ తన మ్యాగజైన్‌లో కొనియాడింది.సామాజిక ప్రభావాన్ని సృష్టించగలిగిన ప్రపంచవ్యాప్తంగా 10 వేల మంది క్రియేటర్లను ఎంపిక చేసే యూఏఈ గోల్డెన్ వీసాకు హఫీజ్ అర్హత సాధించడం ఎంతో గొప్ప విషయం. సాధారణంగా రెండేళ్ల వీసాకే రూ. 4 కోట్లకు పైగా ఖర్చయ్యే చోట.. హఫీజ్‌కు, ఆయన కుటుంబ సభ్యులకు పదేళ్లపాటు ఉచితంగా యూఏఈలో నివసించేందుకు.. అక్కడ ఉద్యోగం లేదా వ్యాపారం చేసుకునేందుకు ఈ వీసా అవకాశం కల్పిస్తుంది. అంటే దాదాపు హఫీజ్‌కు పరోక్షంగా రూ.40 కోట్ల వరకు ఆదా అయింది. ఈ అరుదైన అవకాశం దక్కడంపై సయ్యద్ హఫీజ్ ను సదాశివ ఫౌండేషన్ శాలువాలతో సన్మానించారు. హఫీజ్ సాధించిన ఈ అంతర్జాతీయ విజయం తెలుగు యువతకు ఒక స్ఫూర్తిదాయకమైన ఉదాహరణగా నిలుస్తుందన్నారు.

## మొంథా తుపాను ఎఫెక్ట్.. తెలంగాణలో అత్యంత భారీ వర్షాలు

**హైదరాబాద్** మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణ రాష్ట్రానికి మరో మూడు రోజులు అత్యంత భారీ వర్ష సూచన ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం మొంథా తుపానుగా మారిందని తెలిపారు. మొంథా తుపాను కాకినాడకి 570 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 600 కిలోమీటర్ల పరిధిలో కేంద్రీకృతం అయిందని చెప్పుకొచ్చారు. రేపు(మంగళవారం) ఈ తుపాను ఉత్తర వాయవ్య దిశలో కదిలి తీవ్ర తుపానుగా మారనుందని పేర్కొన్నారు. ఈ తీవ్ర తుపాను మంగళవారం రాత్రి, లేదా ఎల్లుండి(బుధవారం) ఉదయంలోగా మచిలీపట్నం, కళింగపట్నం ఇంచుమించు.. కోస్తా ఆంధ్రప్రాంతంలో తీరం దాటే అవకాశం ఉందని తెలిపారు. తుపాను తీరం దాటే సమయంలో 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించారు. తుపాను ప్రభావంతో ఈరోజు(సోమవారం) నాగర్ కర్నూల్, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉండే అవకాశాలు ఉన్నాయని వివరించారు. మిగతా అన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొన్నారు. మంగళవారం, బుధవారం భారీ నుంచి అతి భారీ వర్ష సూచన ఉండే అవకాశం ఉందని వివరించారు. మంగళవారం పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్లు ప్రకటించారు. మంగళవారం 19 జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని వెల్లడించారు. బుధవారం ఆదిలాబాద్, కొమరం భీమ్, ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు అత్యంత భారీ వర్ష సూచన ఉంటుందని తెలిపారు. తుపాను దృష్ట్యా ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశామని ప్రకటించారు. అలాగే, ఎల్లుండి బుధవారం నిర్మల్, మంచిర్యాల, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు భారీ వర్ష సూచన ఉండే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

## తెలంగాణలో గన్ కల్చర్ పెరుగుతోంది




**హైదరాబాద్:** రాష్ట్రంలో రైతుల పరిస్థితి రోజురోజుకూ దిగజారిపోతోందని తెలంగాణ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం రైతులకు బేడీలు వేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసుల కాళ్లు పట్టుకునే దుస్థితికి తీసుకొచ్చిందన్నారు. రైతులు పండించిన పంటను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని అమ్మలేని స్థితిలో ఉన్నారని చెప్పారు. "పదవీవిరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు బెనిఫిట్స్, పింఛన్ ఇవ్వడం లేదు. రెండేళ్ల నుంచి బెనిఫిట్స్ రావడం లేదని ముఖ్యమంత్రికి లేఖ రాశా. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. ఉద్యోగులు, రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోంది. రాష్ట్రంలో గన్ కల్చర్ పెరుగుతోంది. సాధారణ వ్యక్తికే కాదు.. పోలీసులకే రక్షణ లేకుండా పోయింది. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ గెలిస్తే.. రౌడీ షీటర్లపై కేసులు ఎత్తివేస్తుంది. వారికి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తుంది. మజ్లిస్‌తో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం శాంతి భద్రతలను దెబ్బతీస్తోంది" అని రామచందర్‌రావు ఆరోపించారు.

**జూబ్లీహిల్స్‌లో పోటీ మజ్లిస్– భాజపా మధ్యే**

రాబోయే రోజుల్లో భాజపా విజయానికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నాంది కావాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఉప ఎన్నికపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, శక్తి కేంద్ర ఇన్‌ఛార్జులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడారు. "జూబ్లీహిల్స్‌లో మజ్లిస్–భాజపా మధ్యే పోటీ ఉంటుంది. ప్రజలు భాజపాకు ఓటేయకుంటే మజ్లిస్ సీట్లు 8 అవుతాయి. ఆ పార్టీని ఆపాలంటే భాజపాను గెలిపించాలి. జూబ్లీహిల్స్‌కు కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి చేసిందేమీ లేదు. భాజపాను గెలిపించాలనే ఆలోచనలో ప్రజలు ఉన్నారు" అని రామచందర్‌రావు అన్నారు.

## ఫుల్ జోష్‌లో కేసీఆర్

-మొదటిపేజీ తరువాయి



రాజకీయ పరిణామాలపై ఆరా తీయడంతో పాటు తన దృష్టికి వచ్చిన అంశాలను కూడా ప్రస్తావించారట. చాలా రోజుల తర్వాత తమ అధినేత అంత యాక్టీవ్‌గా..అధికారంలో ఉన్నంత జోష్‌లో కనిపించడంతో బీఆర్ఎస్ నేతలు హ్యాపీ అయిపోతున్నారు. ఇక ఈ సమావేశంలో కేసీఆర్ మాట్లాడిన మాటలు, ఇచ్చిన భరోసా గులాబీ నేతల్లో నూతన ఉత్తేజం నిపిందట. రెండేళ్లు కాంగ్రెస్ పాలనపై తెలంగాణ ప్రజలు విసిగిపోయారని, ఇచ్చిన ఒక్క హామీని కూడా సరిగ్గా నెరవేర్చలేదని, జనానికి కాంగ్రెస్ సర్కార్‌పై నమ్మకం పోయిందని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు కేసీఆర్. ఇదే సమయంలో వచ్చే రెండున్నరేళ్లలో మళ్లీ అధికారంలోకి వస్తామని అధినేత కేసీఆర్ నమ్మకంగా చెప్పడం బీఆర్ఎస్ నేతలకు బూస్టప్ ఇచ్చిందట.

**మళ్లీ ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టబోతున్న సార్..**

ఫాంహౌస్ మీటింగ్‌లో గులాబీ బాస్ మాట తీరును గమనించిన కారు పార్టీ లీడర్లు..సార్ మళ్లీ ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టబోతున్నారని అంటున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా కేసీఆర్ ఒక సభలో పాల్గొంటారని అంటున్నారు. ఇక ఇక్కడి నుంచి మునుపటిలా యాక్టీవ్ కాబోతున్నారట. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది కాబట్టి..ఇప్పటినుంచే ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలని కేసీఆర్ డిసైడ్ అయినట్లు తెలంగాణ భవన్ వర్గాల టాక్. ఈ క్రమంలోనే ఇకపై కేసీఆర్ రెగ్యులర్‌గా తెలంగాణ భవన్‌కు రానున్నట్లు తెలుస్తోంది. పార్టీ లీడర్లతో వరుస సమావేశాలు, కార్యకర్తల మీటింగ్‌లు, ప్రజా సమస్యలపై కార్యాచరణ రూపొందించడం వంటి యాక్టివిటీతో గులాబీ దళపతి బిజీ బిజీగా గడపనున్నారని ముఖ్య నేతలు చెబుతున్నారు.పరిస్థితులను బట్టి జిల్లాల పర్యటనలకు వెళ్లేందుకు కూడా ఆయన ప్లాన్ చేస్తున్నారట. ఇదే గనుక జరిగితే బీఆర్ఎస్ పార్టీలో మునుపటి జోష్ వస్తుందని, మళ్లీ వచ్చే ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చేందుకు ఎంతో యూజ్ అవుతుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఏదైనా సార్ ఫుల్ యాక్టీవ్‌గా కనిపించడంతో లీడర్లకు తిరిగి అధికారంలోకి వచ్చినంత ఆనందం కలిగిందని అంటున్నారు.

# 1/70 చట్టం అమలుకై, మరియు పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత పేరుతో అక్రమంగా కోట్లు దండుకుంటున్న నాన్ ట్రైబల్స్ పై ఫిర్యాదు

విచారణకు స్వీకరించిన జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్

**సామాన్యుడి అస్త్రం అల్లూరి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గల సీతంపేట, పార్వతీపురం, పాడేరు, రంపచోడవరం, చింతూరు, కోట రామచంద్రపురం, శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోగల ఏజెన్సీ ప్రాంతాలలో 1/70 చట్టం పూర్తిగా అమలుకు నోచుకోవటం లేదని, ఈ షెడ్యూల్ ప్రాంతాల్లో పనిచేస్తున్న పంచాయితీ, రెవెన్యూ,ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు , సబ్ కలెక్టర్లు, జిల్లా కలెక్టర్లు ఆదివాసి చట్టాలను అమలు చేసే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని, దీని మూలాన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఐదవ షెడ్యూల్ భూభాగం మొత్తం నాన్ ట్రైబల్స్ కబ్జాలో వెళ్ళిపోతుందని, ఏజెన్సీలోకి నాన్ ట్రైబల్ వలసలు పెరిగిపోయాయని, అక్రమ కట్టడాలు వ్యాపార సముదాయాలు విచ్చలవిడిగా నిర్మించబడుతున్నాయని దీని మూలాన ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసి హక్కులు హరించబడుతున్నాయని, నాన్ ట్రైబల్ సంస్కృతి ఆదివాసి సంస్కృతిని విచ్ఛిన్నం చేస్తుందని దీని మూలాన ఏజెన్సీ ప్రాంత ఆదివాసులు మనుగడం ప్రశ్నార్థకంగా మారుతుందని, ఆదివాసులు ఉనికిని కోల్పోయే ప్రమాదంలో ఉన్నారని, కావున 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, నాన్ ట్రైబల్ వలసలు అరికట్టాలని, ఏజెన్సీలో వలస నాన్ ట్రైబల్స్ కి ఎటువంటి గుర్తింపు కార్డులు జారి చేయవద్దని కోరుతూ జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ కు ఫిర్యాదు చేయడం జరిగిందని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను తెలియజేశారు. అలాగే పోలవరం ప్రాజెక్టు కింద ముంపు కి గురవుతున్న దేవీపట్నం, చింతూరు, కూనవరం, వర రామచంద్రపురం, ఎట్టపాక, కుకునూరు, వేలేరుపాడు, పోలవరం మండలాలకు సంబంధించి స్థానిక నిర్వాసితులకు ఆదివాసులకు సరైన పునరావాసం, ప్యాకేజీ, భూమికి భూమి ఇవ్వడంలో అధికారులు ప్రభుత్వాలు విఫలమయ్యాయని. కానీ ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా వలసలు వచ్చిన నాన్ ట్రైబల్స్ ప్రభుత్వ ఆదివాసి భూములను కబ్జాలు చేసి, కబ్జాలు చేసిన భూములు ద్వారా కోట్ల రూపాయలు ప్రభుత్వ ధనాన్ని ప్యాకేజీ రూపంలో దండుకున్నారని, వారికి అర్హత లేదని తెలిసి కూడా కమిషన్ల కోసం అధికారులు ప్రభుత్వ ధనాన్ని దోచిపెట్టారని, అంతేకాకుండా నిర్వాసితుల కోసం ప్రభుత్వం సేకరిస్తున్న భూమి విషయంలో కూడా ప్రభుత్వ భూమిని కబ్జా చేసి తిరిగి ప్రభుత్వ నీకె అమ్ముకుంటూ ఈ విధంగా కూడా వలస నాన్ ట్రైబల్స్ కోట్ల రూపాయలు దండుకున్నారని, ఇంకా దండుకుంటున్నారని వీరికి స్థానిక అధికారులు అన్ని రకాలుగా కమిషన్ల కోసం సహకరిస్తున్నారని కావున



అసలైన స్థానిక నిర్వాసిత ఆదివాసులకే ప్యాకేజీ కల్పించాలని, నాన్ ట్రైబల్స్ కి పోలవరం ప్యాకేజీ ఇవ్వద్దని, ఇప్పటివరకు ప్రభుత్వ భూములు అమ్ముకొని, మరియు ప్రభుత్వ భూములు పేరుతో ప్యాకేజీ పొందిన నాన్ ట్రైబల్ దగ్గర నుండి డబ్బులు రికవరీ చేయాలని, అక్రమాలకు పాల్పడిన అధికారులపై నాన్ ట్రైబల్ పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరుతూ జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ కి ఫిర్యాదు చేయడం జరిగిందని, ఈ పై రెండు ఫిర్యాదులను జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ విచారణకు స్వీకరించిందని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను ప్రకటన ద్వారా తెలియజేశారు.

# శ్రీగిరిపల్లి గ్రామంలో ఘనంగా సదరు సమ్మేళనం

**సామాన్యుడి అస్త్రం గజ్వేల్** గజ్వేల్ నియోజకవర్గం లోని శ్రీగిరిపల్లి గ్రామంలో యాదవులు సదరు సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడు గజ్వేల్ కానమైన కనకయ్య యాదవ్ రారు. తెలంగాణ యాదవుల సదరు, దునపోతు, ఒక ప్రత్యేకమైన సాంప్రదాయ ఆచారం. ఇది యాదవ కులానికి చెందిన వ్యక్తులు తమ కుటుంబ సభ్యుల మధ్య సంబంధాలను బలపరచడం, స్నేహాన్ని పెంపొందించడం మరియు సాంప్రదాయాలను కొనసాగించడం, ఇప్పుడు ఉన్న గోల్కొండ కొన్ని శతాబ్దాల క్రిందట గొల్ల కొండగా పిలిచేవారు కాల పరిణామైనా గొల్ల కొండ కాస్త గోల్కొండ గా పిలవడం జరుగుతుంది. యాదవుల చరిత్ర చాలా ప్రాచీనమైనది, మరియు వారు కృష్ణుడి వంశానికి చెందిన వారిగా పరిగణించబడతారు. కృష్ణుడు, హిందూ పురాణాలలో ఒక ముఖ్యమైన దేవుడు, యాదవ కులానికి చెందినవాడు,యాదవులు తమ సాంప్రదాయాలు, సంస్కృతులు మరియు ఆచారాలను గౌరవిస్తారు. ఈ కార్యక్రమంలో దున్నపోతుల ఆటపాటలతో సదరు సమ్మేళనం నిర్వహించారు కులం పెద్దమనుషులు. దాసరి పెద్దోళ్ల బాలయ్య. మానక బాలమల్లు. దాసరి వెంకటేశ్ యాదవ్. మోతే కొమురయ్య యాదవ్. వేముల రాములు యాదవ్. సంద కన్నా యాదవ్. యాదవ్.




సంద అశోక్ యాదవ్. యాదవ కుల యువకులు ఈ కార్యక్రమాన్ని ఘనవిజయంగా నిర్వహించారు.

# ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

వెంట వెంటనే...

సన్న వడ్లకు రూ 500 బోనస్ ఇవ్వాలి

ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి

**సామాన్యుడి అస్త్రం గజ్వేల్** ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వర్గల్ లో వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, ప్యాక్స్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, సిఈఓ జితేందర్ రెడ్డిలతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించే పంటలు దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. గత రబీలో సన్న ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన బోనస్ ఇవ్వలేదని, అయితే ప్రస్తుత ఖరీఫ్ లో నైనా సన్నధాన్యాన్ని విక్రయించిన రైతులకు క్వింటాలుకు రూ 500 చొప్పున బోనస్ వెంటనే చెల్లిస్తే వారికి ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా అన్నదాతల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేయొద్దని, పండించిన ప్రతి పంట కొనుగోలుకు ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. మొక్కజొన్న కొనుగోలును ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో మధ్య దళారీలు ఆర్థికంగా లబ్ధి పొందినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు ధాన్యాన్ని



కొనుగోలు కేంద్రాలకు తరలించాలని అన్నారు. కాగా గ్రేడ్ మొదటి రకం ధాన్యానికి రూ 2389/బి రెండవ రకం ధాన్యానికి రూ రూ 2369 ప్రభుత్వం చెల్లిస్తున్నట్లు తెలిపారు. అలాగే పత్తి కొనుగోలుకు సీసీఐ ముందుకు వచ్చిందని, దీనిని దృష్టిలో పెట్టుకొని రైతులు తాము పండించిన పత్తిని సిసిఐ కేంద్రాలకు తరలించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్ రెడ్డి, జిల్లా టిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు నాగరాజు, నేతలు రమేష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, నర్సింహారెడ్డి, జనపకట్టే రాజు, కిట్టు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యకు పునాది ప్రీ ప్రైమరి

మండల విద్యాధికారి ప్రభాకర్,

**సామాన్యుడి అస్త్రం ధర్మారం :** విద్యకు పునాదిలాంటిది పూర్వ ప్రాథమిక విద్య అని మండల విద్యాధికారి ప్రభాకర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలోని చింతలపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరి సెక్షన్ ను సోమవారం మధ్యాహ్నం ప్రభాకర్ గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక స్థాయి కంటే ముందుగా పాఠశాల సంసిద్ధత మరియు ఆటపాటలతో కూడిన విద్య పూర్వప్రాథమిక పాఠశాలల్లోనే నేర్చుకుంటారని ఈ స్థాయి విద్యార్థి విద్యాభ్యాసానికి పునాది అని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రముఖులు, విద్యార్థుల సమక్షంలో రిబ్బన్ కట్ చేసి ప్రీ ప్రైమరి సెక్షన్స్ ని ఆయన ప్రారంభించారు. తమ గ్రామంలో ప్రీ ప్రైమరి సెక్షన్ మంజూరు కావటం పట్ల తల్లిదండ్రులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల



ప్రధానోపాధ్యాయురాలు కవిత, కాంప్లెక్స్ ప్రధానోధ్యాయులు శ్రీనివాసరావు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ శ్రీలత, ప్రీ ప్రైమరి ఇన్స్ట్రక్టర్ స్రవంతి, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 15 ఏళ్లుగా అంగన్వాడీ టీచర్ లేక పిల్లల భవిష్యత్తు చీకట్లో

హుకుంపేట మండలం గన్నేరుపుట్టు గ్రామంలో తల్లిదండ్రుల వేదన



**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** హుకుంపేట మండలం మఠం పంచాయతీ పరిధిలోని గన్నేరుపుట్టు గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రం గత 15 సంవత్సరాలుగా ఉపాధ్యాయురాలు లేక ఖాళీగా ఉంది. ఈ కేంద్రంలో సుమారు 30 నుండి 35 మంది చిన్నారులు ఉన్నప్పటికీ, వారికి శిక్షణ, పోషణ, పాఠశాల ప్రాథమిక విద్య ఇవ్వడానికి అంగన్వాడీ టీచర్ లేకపోవడం తల్లిదండ్రులను ఆందోళనకు గురి చేస్తోంది.ప్రతిరోజు చిన్నారులు అంగన్వాడీ కేంద్రానికి వెళ్లి బయటపడ్డ ప్రాంగణంలో ఆడుకుంటూ సమయం గడుపుతున్నారు. ఆయా మాత్రం విధులు నిర్వర్తిస్తుండగా, విద్యా సంబంధిత మార్గదర్శనం లేకపోవడంతో పిల్లల అభివృద్ధి దెబ్బతింటోంది.గ్రామస్తులు మాట్లాడుతూ, "గత 15 నుంచి 20 ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. మా పిల్లలకు అంగన్వాడీ టీచర్ ను వెంటనే నియమించాలని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలి" అని విజ్ఞప్తి చేశారు. స్థానికులు ఈ అంశంపై ఐసీడీఎస్ అధికారుల దృష్టి సారించి, తక్షణమే అంగన్వాడీ టీచర్ నియామకం చేపట్టి చిన్నారుల విద్యా, పోషకాభివృద్ధికి తోడ్పడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## నిద్రమత్తులో కాంగ్రెస్ పాలన

-రోడ్లు మరమ్మత్తులు వెంటనే చేయాలి

-రోడ్ల గుంతలపై బీఆర్ఎస్ పార్టీ నిరసన



**సామాన్యుడి అస్త్రం మణుగూరు :** మాయమాటలతోటి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను, అభివృద్ధిని వదిలేసి నిద్రమత్తులో వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ కరకగూడెం మండల అధ్యక్షుడు రావుల సోమయ్య పేర్కొన్నారు. సోమవారం కరకగూడెం మండలం అనంతారంలోని బయ్యారం-తాడ్వాయి ప్రధాన రహదారిపై ఉన్న గుంతలను మరమ్మత్తులు వెంటనే చేయాలని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి 22 నెలలు గడిచిన సంక్షేమం, అభివృద్ధికి కొండంత దూరంలో వదిలేసి ప్రభుత్వం కాలక్షేపం చేస్తుందని, జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్న పర్యటనలకు మాత్రమే పనికి వస్తారని, ప్రజాభివృద్ధికి శూన్యమని సూచించారు. ప్రధాన రహదారిపై గుంతలమయంగా ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారిందని, రోడ్లు మరమ్మత్తులు చేయకుంటే ప్రాణనష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని ఆకాంక్షించారు. జిల్లా మంత్రులు స్పందించి వెంటనే ప్రజల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకొని రోడ్లు గుంతలకు మరమ్మత్తులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బుడగం రాము, కొమరం రాంబాబు, అత్తె నాగేశ్వరరావు, రేగా సత్యనారయణ, అత్తె సత్యనారయణ, గుడ్ల రంజిత్, బైరశెట్టి చిరంజీవి, ఊకే రామానాథం, పాయం నర్సింహారావు, గొగ్గల నాగమణి, పసునురి అంజయ్య, నిట్టా ఏడుకొండలు, ఈసం సమ్మయ్య, కోమ్మ ప్రసాద్, సుతారి నాగేష్, బట్టా బిక్షపతి, తాటి వెంగళరావు, యాకుబ్ ఖాన్, ఫాజ్జల్ హుసైన్, రాజేశ్వరరావు, పాయం క్రిష్ణ, అత్తె ముకుందా, ముగిళిపువ్వ వెంకన్న, నిట్టా ప్రభాకర్, సిద్ది సునీల్, కార్యకర్తలు, తదితరులు పాల్గోన్నారు.

## గురుకుల పాఠశాలలో ఆత్మహత్య చేసుకున్న బాలిక కుటుంబాన్ని పరామర్శ కు బి.ఆర్.ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.ఆర్ రాక ..

- కార్యకర్తలు , నాయకులూ అధిక సంఖ్యలో పాల్గొనాలి .
- తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ .

**సామాన్యుడి అస్త్రం కరీంనగర్ :** హుజురాబాద్ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన వర్షిత అనే అమ్మాయి వంగర గురుకుల హాస్టల్ లో ఆత్మహత్య చేసుకున్నందున వర్షిత కుటుంబాన్ని పరామర్శించడానికి మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకి భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నారని,హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ పరామర్శకు హుజురాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ తెలిపారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖకు మంత్రిని ఏర్పాటు చేయకుండా విద్యా వ్యవస్థ పై నిమ్మకు నిరతనట్లుగా వ్యవహరిస్తున్నారని, కనీసం ఇప్పటివరకు ఆ విద్యార్థినికి ఆర్థిక సహాయం అందించకపోవడం చాలా బాధాకరమని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలను గాలికి వదిలేసి గురుకులాల్లో చదివే అనేకమంది విద్యార్థుల మరణాలకు కారణమవుతున్న ఈ ప్రభుత్వాన్ని ఎండ కట్టే రోజు వస్తుందని, ఈ సందర్భంగా తెలియజేస్తున్నానని బండ శ్రీనివాస్ తెలిపారు.



# తుఫానును ఎదుర్కొనడానికి సర్వసన్నద్ధం

**సామాన్యుడి అస్త్రం అల్లూరి :** నష్ట నివారణకు ముందుజాగ్రత్త చర్యలను చేపట్టాం సచివాలయ సిబ్బంది ద్వారా గ్రామస్థాయిలో అప్రమత్తత పునరావాస కేంద్రాలను, ఆహార పదార్ధాలను సిద్ధం చేశాం పురిపాకల్లో వారిని సురక్షిత చోట్లకు తరలిస్తున్నాం జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ పాడేరు, అక్టోబరు 27: మోంథా తుఫానును ఎదుర్కొనడానికి జిల్లా యంత్రాంగం సర్వ సన్నద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అప్రమత్తంగా ఉన్నామని అన్నారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో మీడియా తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తుఫాను సన్నద్ధతను వివరించారు. రేపు మోంథా తుఫాను కాకినాడ వద్ద తీరాన్ని తాకే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో వరుసగా మూడు రోజులపాటు భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపారు. అధికారులు ఇచ్చే సూచనలు పాటిస్తూ, యంత్రాంగానికి ప్రజలు తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు. జిల్లాలో తుఫాను ప్రభావం పడే అవకాశం ఉన్న 163 గ్రామాలను ముందే గుర్తించామని, అక్కడి యంత్రాంగాన్ని మరింత అప్రమత్తం చేశామని తెలిపారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా తుఫాను ప్రభావం పడే 12 మండలాల లో పరిధిలో ముందస్తు చర్యలను చేపట్టామని, పోలీసు సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచామని చెప్పారు. జిల్లా లో 63 పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామని, ఆహార పదార్థాలు, మందులు తదితర అత్యవసరమైన వాటిని సిద్ధంగా ఉంచామని తెలిపారు. వాగులు, గెడ్డలు, రిజర్వాయర్లు, నదుల్లో నిరంతరం నీటి మట్టాన్ని గమనిస్తూ, ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నామన్నారు. నిండుగా ఉన్న రిజర్వాయర్లలో ముందుజాగ్రత్త చర్యగా నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. గండ్లు పడే అవకాశం ఉన్నచోట ఏఈలకు పర్యవేక్షణా బాధ్యతలను అప్పగించామన్నారు. పంటనష్టం కలగకుండా పంటలను బట్టి వ్యవసాయ శాఖాధికారులచేత సూచనలు అందిస్తున్నామన్నారు. 11 హెలిప్యాడ్స్ అత్యవసర పరిస్థితి లో పెట్టడం జరిగిందని చెప్పారు. కమ్యూనికేషన్ కి ఎటు వంటి ఇబ్బంది రాకుండా అయా మొబైల్ నెట్వర్క్ సంస్థల నుండి ప్రత్యక బృందాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. శాటిలైట్ ఫోన్స్ ఏర్పాటు చేశాము అన్నారు. రహదారుల మరామత్తుల కోసం 14 ప్రత్యక బృందాలు ఏర్పాటు చేసాము అన్నారు. 82 దుర్లభమైన పాయింట్స్ గుర్తించి అక్కడ పోలీస్ మరియు రెవెన్యూ శాఖాల సిబ్బందని యేపాటు చేసామని చెప్పారు. ప్రార్ధన స్థలాలు, పబ్లిక్ స్థలాలు, ఆటో ల లౌడ్ స్పీకర్స్ తో తుఫాను హేచ్చరికలను గురుంచి ప్రజలకు చేరవేయడం జరిగిందని అన్నారు. ప్రజలు అత్యావసర పరిస్థితి అయితే తప్పించి బయటకి రావద్దని తెలిపారు. విద్యాసంస్థలకు రెండు రోజులపాటు సెలవులు ప్రకటించామని, సంక్షేమ వసతిగృహాల పిల్లలను బయటకు వదలకుండా చూడాలని సూచించామన్నారు. చెట్లు, కొమ్మలు



విరిగిపడే అవకాశం ఉన్నందున, వాటిని వెంట వెంటనే తొలగించేందుకు 21 క్రేన్స్ , పవర్ సా తదితర పరికరాలను జిల్లా కు 5 చెక్ పోస్ట్ దెగ్గర సిద్దంగా ఉంచామని చెప్పారు. విద్యుత్ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేయడంతోపాటు, సబ్ స్టేషన్లలో అదనపు సిబ్బందిని సైతం సిద్ధంగా ఉంచమని ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రసవానికి 10 రోజులు గడువు ఉన్న గర్భిణులను సైతం ముందుజాగ్రత్తగా ఆసుపత్రికి తరలిస్తున్నామని తెలిపారు. మత్స్యకారులంతా సముద్రంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని, అందరూ ప్రస్తుతం తమ గ్రామాల్లోనే ఉన్నారని సమాచారం వచ్చిందని కలెక్టర్ వివరించారు. .ఈ కార్యక్రమం లో ఎస్ పి అమిత్ బర్దర్, ఇంచార్జ జాయింట్ కలెక్టర్ , పాడేరు ఐ టి డి ఏ పి ఓ తిరుమణి శ్రీ పూజ, ఆర్ డి ఒ లోకేశ్వర్అర రావు తదితరులు పాల్గున్నారు.

# ప్రశాంతంగా ముగిసిన మద్యం దుకాణాల డ్రా

జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

**సామాన్యుడి అస్త్రం మణుగూరు :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నూతన మద్యం దుకాణాల లైసెన్సుల కేటాయింపు కోసం నిర్వహించిన డ్రా కార్యక్రమం సోమవారం ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆధ్వర్యంలో కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య తదితర అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను పూర్తిగా అనుసరించి, మద్యం దుకాణాల లైసెన్సుల కేటాయింపు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా మరియు నిష్పక్షపాతంగా నిర్వహించామని తెలిపారు. అభ్యర్థులందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు లాటరీ విధానంలో డ్రా నిర్వహించామని, ప్రతి దశలోనూ మానవీయ జోక్యం లేకుండా ప్రక్రియను పూర్తిచేశామని పేర్కొన్నారు. కార్యక్రమం మొత్తం సీసీటీవీ పర్యవేక్షణలో, వీడియో రికార్డింగ్‌తో, ఎల్‌ఈడి స్క్రీన్ ద్వారా ప్రజల సమక్షంలో స్పష్టమైన నియమ నిబంధనల ప్రకారం నిర్వహించబడిందని తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన డ్రా కార్యక్రమం మధ్యాహ్నం 2 గంటలకు ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ వివరించారు. జిల్లాలో మొత్తం 3922 దరఖాస్తులు అందగా, 88 దుకాణాల లైసెన్సులు కేటాయించబడ్డాయని కలెక్టర్ వెల్లడించారు. మండలాల వారీగా లైసెన్సుల వివరాలను అధికారికంగా ప్రకటించారు. ఎంపికైన అభ్యర్థులు నిర్దేశిత కాలవ్యవధిలో లైసెన్స్ ఫీజులు చెల్లించి, షాపుల స్థాపనకు సంబంధించిన తదుపరి చర్యలు పూర్తి చేయాలని సూచించారు. మద్యం విక్రయం విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన నియమాలు, సమయాలు, పరిమితులు తప్పనిసరిగా పాటించాలని, వాటిని ఉల్లంఘించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ శాఖ ప్రధాన లక్ష్యం ఆదాయం సమీకరణతో పాటు మద్యం నియంత్రణలో చట్టబద్ధమైన పద్ధతులను పాటించడం అని కలెక్టర్ పేర్కొన్నారు. అనుమతి లేకుండా మద్యం విక్రయించే అక్రమ దుకాణాలు, బెల్ట్ షాపులు, నకిలీ మద్యం తయారీ కేంద్రాలపై ప్రత్యేక దాడులు, సర్వేలు కొనసాగుతాయని తెలిపారు. ప్రజలు కూడా సామాజిక బాధ్యతతో ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై అధికారులకు సమాచారం అందించాలని కోరారు. డ్రా కార్యక్రమం ఎటువంటి



గందరగోళం లేకుండా, సమగ్రమైన ఏర్పాట్లతో ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో అభ్యర్థులు, అధికారులు, సిబ్బంది అందరూ సహకరించినందుకు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రహమాన్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్డెంట్ కరంచంద్ మరియు సంబంధిత శాఖాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి రహిత సింగరేణికై పాటుపడాలి

జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్




**సామాన్యుడి అస్త్రం మణుగూరు** సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ సూచన మేరకు ప్రతి సంవత్సరం సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న విజిలెన్స్ వారోత్సవాలను చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ నాయక్, ఐఆర్ఎస్ ఆదేశానుసారం సింగరేణి వ్యాప్తంగా విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను “విజిలెన్స్ మన అందరి ఉమ్మడి బాధ్యత” అనే నినాదంతో 5.27.10.2025 ?? 02.11.2025 నిర్వహించబడుతున్నాయి. విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా సోమవారం నాడు మణుగూరు ఏరియాలోను జనరల్ మేనేజర్ కార్యాలయంలో, అన్నీ గనులు, డిపార్ట్ మెంట్ల యందు సింగరేణి ఉద్యోగులతో మరియు పివి కాలనీ, సింగరేణి సేవ భవన్ లో సింగరేణి సేవ సమితి సభ్యులతో, సింగరేణి హై స్కూల్ లో విద్యార్ధిని విద్యార్థులతో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ప్రారంభించబడినవి. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా జిఎం కార్యాలయ ప్రాంగణంలో జరిగిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాలకు ముఖ్య అతిధి గా విచ్చేసిన ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ప్రసంగిస్తూ అవినీతి అనేది క్యాన్సర్ కంటే భయంకరమైనది. అవినీతి అనేది వ్యక్తిత్వాలనే కాకుండా సంస్థల్ని కూడా నిర్వీర్యం చేస్తుంది. కాబట్టి అవినీతి ఎక్కడున్న దాన్ని మొగ్గలోనే తుంచివేయలి. మన సంస్థలో అవినీతి నిర్మూలన, పారదర్శకత యొక్క ఆవశ్యకతపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ నాయక్, ఐఆర్ఎస్ ఇచ్చిన ఆదేశం మేరకు ప్రతి ఏటా విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించబడుచున్నవి. మనకు యాజమాన్యం ఎంతో మెరుగైన జీతభత్యాలు, సకల సౌకర్యాలు కల్పిస్తుంది. అవినీతి అనే ఆలోచన మనసులో రాకుండా ఎక్కడ అవినీతి జరిగినా వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లటం తమ వంతు నైతిక భాద్యతగా భావించాలి. రిక్రూట్మెంట్, కొనుగోళ్ళు, బొగ్గు రవాణా, కాంట్రాక్టులు, సంస్థాగత కార్యకలాపాల నిర్వహణలో ఏరియా ఉద్యోగులు, అధికారులు అవినీతిరహిత మణుగూరు ఏరియా కొరకు మనసా వాచా కర్మణా కృషి చేస్తూ ప్రతి ఒక్కరూ అవినీతి రహిత సింగరేణికై పాటుపడాలి. మన సంస్థకు ఎంతగా యాంత్రిక శక్తి, శ్రమ శక్తి సామర్థ్యము ఉన్నపటికి, అవినీతి వల్ల అభివృద్ధి కుంటుపడుతుంది. కావున, మనమందరం యంత్ర శక్తిని, శ్రమ శక్తిని పూర్తి స్థాయిలో వినియోగించి నిజాయితీ నిబద్ధతతో ప్రతి రోజు పని గంటలను పూర్తి స్థాయిలో సద్వినియోగపర్చుకుంటూ వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను సాధించడం ద్వారా సంస్థ పురోభివృద్ధికి పునరంకితం కావాలి అన్నారు. ఈ సందర్భంగా ఏరియాలో జరిగిన ఆయా కార్యక్రమాలలో అందరి చేత ఇంటెగ్రిటీ ప్రతిజ్ఞ చేయించడము జరిగింది. ఈ సందర్భంగా విజిలెన్స్ వారోత్సవాల పై మరింతగా అవగాహన కలిగించేందుకు గాను సింగరేణి ఉద్యోగులకు, సింగరేణి పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు “విజిలెన్స్ మన అందరి ఉమ్మడి బాధ్యత” అనే అంశంపై వ్యాస రచన పోటీలు కూడా నిర్వహించనున్నాము అని ఏరియా అధికార ప్రతినిధి డిజిఎం (పర్సనల్) ఎస్. రమేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం బి.శ్రీనివాస చారి, ఏజిఎం(ఐఈడి) సిహెచ్ రాంబాబు, డిజిఎం (ఫీనాన్స్) అనురాధా, పర్చేస్ హెచఓడి సోమ ప్రవీణ్ కుమార్, పర్సనల్ మేనేజర్ ఎల్.తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, ఏఐటియూసి నాయకులు రాంనర్సయ్య, సిఎంఓఏఐ రిప్రసెంటేటివ్ పి.రమేష్, పర్యావరణ అధికారి జే.శ్రీనివాస రావు, ఐటి మేనేజర్ సాయిల సురేశ్, ఇతర అధికారులు, జిఎం ఆఫీస్ సిబ్బంది, ఇతర సేవ సభ్యులు, సింగరేణి హై స్కూల్ హెచ్ఎం ఆర్. కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

## 40 వేల లీటర్ల కెపాసిటీ వాటర్ ట్యాంకు భూమి పూజ చేసిన పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు



**సామాన్యుడి అస్త్రం మణుగూరు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం వాసవి నగర్ లో 30 లక్షల రూపాయల వ్యయంతో 40 వేల లీటర్ల కెపాసిటీ గల వాటర్ ట్యాంక్ ను ప్రారంభించిన పినపాక శాసన సభ్యుడు పాయం వెంకటేశ్వర్లు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ వాసవి నగర్ ప్రజల అవసరాలను ముందుగానే గుర్తించి తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు పడకూడదని 30 లక్షల రూపాయలు మంజూరు చేయించి యుద్ధ ప్రాతిపదికన పనులు జరిపించి గ్రామ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని అన్నారు. అనంతరం వాటర్ ట్యాంక్ పరిసరాలలో మొక్కలు నాటు కార్యక్రమంలో పాల్గొన్న పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు. ఈ కార్యక్రమంలో డీటీ రామారావు, ఏఈ రామారావు, ఎంపీవో వెంకటేశ్వర్లు, పిడబ్ల్యూఈఎస్ అరుంధతి, డి బ్రహ్మదేవ్, మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, టౌన్ అధ్యక్షుడు శివ సైదులు, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, పినపాక నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తరుణ్ రెడ్డి,14 టైర్ ప్రెసిడెంట్ దుగ్గంపూడి ఈశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన దేవస్థానం చైర్మెన్ ఇంగిలే రామారావు

**సామాన్యుడి అస్త్రం ఇల్లంతకుంట :** మద్రివానిపల్లి గ్రామంలో జిల్లెల్ల మల్లారెడ్డి అనారోగ్యం తో చనిపోగా శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం చైర్మెన్ ఇంగిలే రామారావు పరామర్శించి మల్లారెడ్డి గారికుటుంబాన్ని వారి కొడుకు జలెందరుకు ప్రగాఢ సానుభూతి నీ తెలియజేశారు. మనోధైర్య కల్పించడం జరిగింది .ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సంజీవరెడ్డి ధర్మకర్త పరమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సంపత్, మార్కెట్ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి , గోపాల్ రెడ్డి గ్రామ శాఖ అధ్యక్షులు వీరారెడ్డి, రాజీ రెడ్డి,భూంరెడ్డి మైనారిటీ నాయకులు పాషా తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా ఆల్ ఇండియా స్టూడెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు సంజయ్ జన్మదిన వేడుకలు



**సామాన్యుడి అస్త్రం కరీంనగర్ :** ఆల్ ఇండియా స్టూడెంట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్ .ఆల్ ఇండియా స్టూడెంట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు బుర్ర సంజయ్ జన్మదిన వేడుకల్ని జమ్మికుంట పట్టణ కేంద్రంలో ఘనంగా నిర్వహించుకొని అలాగే జమ్మికుంట శివాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది . అనంతరం అమ్మ వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ సంజయ్ తాను చదువుకున్న రోజుల్లో ఎదుర్కొన్నటువంటి సమస్యలను ఏ ఒక్క నిరు పేద విద్యార్థి కూడా ఎదుర్కోవద్దని విద్యా రంగంలో జరుగుతున్నటువంటి అన్యాయాలను అసమానతలను ముందుండి ప్రతి పేద విద్యార్థికి న్యాయం జరిగే విధంగా ప్రశ్నించే గొంతుకగా మారాడు గత ప్రభుత్వంలో విద్యార్థుల పై పడినటువంటి కార్పొరేట్ విద్యాసంస్థల అన్యాయాలను అరికట్టి విద్యార్థుల స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్మెంట్ సమస్యలు విద్యార్థులు ఎదుర్కోకుండా ప్రతి విద్యార్థికి అండగా నిలిచాడు అలాగే తాను రానున్న రోజుల్లో గొప్ప పదవులను అధిరోహించి విద్యార్థులకే కాకుండా ప్రజలకు కూడా న్యాయం చేసే దిశగా ముందుకు సాగి సేవ చేయాలని కోరుకుంటున్నాను ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల అధ్యక్షుడు ఆడపు సాయి కిరణ్ , మహేష్ కుమార్ , హర్షత్ ,రాజేష్ ,ఆదిత్య ,సంజీవ్ , మౌనిక, శిరీష ,మానస ,కళ్యాణి ,సుకన్య ,అనూష, తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాం ప్రారంభం ..

కొనుగోలు కేంద్రాంన్ని ప్రారంభించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చెర్మన్ పొనగంటి సంపత్ ...



**సామాన్యుడి అస్త్రం కరీంనగర్ :** జమ్మికుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో జమ్మికుంట పాత వ్యవసాయ మార్కెట్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ పొనగంటి సంపత్ ప్రారంభించారు. చైర్మన్ పొనగంటి సంపత్ మాట్లాడుతూ మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టకుండా ధాన్యాన్ని దింపుకోవాలని కోరారు. ధాన్యంలో తేమశాతం 17కి మించకుండా ఉండాలని, బాగా ఎండబెట్టి తాలు, మట్టి లేకుండా ఉండే విధంగా చూడాలన్నారు. తూకం వేసి ఆన్లైన్ లో అప్లోడ్ చేయగానే 24గంటల్లో రైతు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్నారు. ఎ గ్రేడ్ మద్దతు ధర రూ.2389, సాధారణ రకం రూ.2369 ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం వడ్లకు రూ.500 బోనస్ వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పుల్లూరు స్వప్న, మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కల్లపల్లిరాజేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్లు, మార్కెట్ వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి, ఎరబెల్లి రాజేశ్వర్ రావు, మార్కెట్ డైరెక్టర్, మాజీ కౌన్సిలర్ పొనగంటి రాము, మార్కెట్ కార్యదర్శి ఆర్ మల్లేశం, సీఈఓ రవీందర్, ఏఓ ఖాదర్ హుస్సేన్, రైతులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సామాన్యుడి అస్త్రం

# హలో విద్యార్థి - చలో కలెక్టరేట్

**బిఆర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పిలుపు**

**జమ్మికుంట మండల టౌన్ అధ్యక్షులు కొమ్ము నరేష్**



**సామాన్యుడి అస్త్రం కరీంనగర్ :** హలో విద్యార్థి చలో కలెక్టరేట్లో భాగంగా జమ్మికుంట మండలంలో ఉన్నటువంటి పలు విద్యాసంస్థల్లో ఉన్న విద్యార్థులను కలిసి మాట్లాడటం జరిగింది ఈ సందర్భంగా బిఆర్ఎస్వి విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ 8000 కోట్ల బకాయిలను విడుదల చేయకుండా కాలయాపన చేస్తూ గత ప్రభుత్వం మంజూరు చేసిన టోకెన్లను కూడా ఇవ్వకుండా పేద మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత చదువులకు దూరం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేట్ విద్యాసంస్థలన్నీ ఇబ్బందులకు గురవుతున్నాయి ఇప్పటికే గతంలో రెండుసార్లు డిగ్రీ పీజీ ఇంజనీరింగ్ కళాశాల యజమాన్యాలు బందుకు పిలుపునివ్వడం జరిగింది. భవిష్యత్తులో ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకపోతే నవంబర్ 3వ తారీఖు మళ్లీ బందుకు పిలుపునివ్వడంతో పేద మధ్యతరగతి విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతూ ఉన్నత చదువులను అధ్యయనం చేయడంలో ఇబ్బందులకు గురవుతున్నారు రాష్ట్రంలో ఆప్కారి శాఖకు మంత్రి నియమించిన రేవంత్ రెడ్డి విద్యాశాఖకు ఎందుకు మంత్రి నియమించకుండా తన వద్దనే ఉంచుకున్నాడు విద్యను భ్రష్టువర్తించే విధంగా తన నిర్ణయాలు ఉన్నాయని వైన్స్ టెండర్లకు అనుమతులు ఇచ్చే రేవంత్ రెడ్డి పేద మధ్యతరగతి విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఉన్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను ఎందుకు విడుదల చేయట్లేదని విద్యార్థి సంఘ నాయకులు మండిపడ్డారు అసెంబ్లీ సాక్షిగా 500 కోట్ల విడుదల చేస్తానని చెప్పి దసరా దీపావళి పండుగ సందర్భంగా 1300 కోట్లు విడుదల చేస్తానని మళ్లీ మాట తప్పి విద్యార్థులకు తీరని అన్యాయాన్ని నిరాశని మిగిలేచాడు చీటికిమాటికి క్యాబినెట్ సమావేశాలు పెట్టుకుంటూ వారి కమిషన్ల కోసం గొడవలు పెడుతూ రోడ్లెక్కి సోషల్ మీడియాలో చెక్కలు కొట్టడం తప్ప విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆలోచన నిర్ణయం తీసుకోపోవడం సిగ్గుచేటు విద్యార్థులకు ఓట్లు లేకపోవచ్చు కానీ వారి తల్లిదండ్రులకు ఓట్లు ఉన్నాయని ఓట్ల సీట్ల రాజకీయం చేస్తే తప్పకుండా భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రేవంత్ రెడ్డినీ హెచ్చరించడం జరిగింది అదేవిధంగా ప్రైవేట్ విద్యాసంస్థలపై విజిలెన్స్ దాడులను వెనక్కి తీసుకోవాలని ఇప్పటికైనా వెంటనే పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ లను వెంటనే రిలీజ్ చేయాలని హెచ్చరించడం జరిగింది ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి నాయకులు హరీష్ వర్మ అప్పని, ఆవుల తిరుపతి యాదవ్, జవ్వాజి అనిల్, వోల్లాల శ్రీకాంత్ ,నాగరాజు ఎండి రహిమాన్ విద్యార్థులు పాల్గొన్నారు

# రాష్ట్రస్థాయి నృత్య పోటీలలో ప్రసంగి డాన్స్ స్టూడియో ఘనవిజయం

**లియాప్రసంగి టీమ్ ద్వితీయ బహుమతి, ప్రసంగి స్నికిత ప్రథమ బహుమతి.**

**స్నికితకు సోలో విభాగంలో ద్వితీయ బహుమతి, నాట్య ప్రసంగికి ప్రత్యేక ప్రదర్శన**





**సామాన్యుడి అస్త్రం కరీంనగర్ :** సన్‌షైన్ కల్చరల్ అకాడమీ 25వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి నృత్య పోటీలలో జమ్మికుంటకు చెందిన ప్రసంగి డాన్స్ స్టూడియో అండ్ ఫిట్‌నెస్ సెంటర్ విద్యార్థులు అద్భుత ప్రతిభను ప్రదర్శించి పలు విభాగాలలో విజయాలను సాధించారు. ప్రసంగి మరియు స్నికిత కలిసి ప్రదర్శించిన సీనియర్ డ్యూయెట్ నృత్యం ప్రథమ బహుమతి ని సాధించారు. అదే విధంగా స్నికిత పాల్గొన్న జూనియర్ సోలో డాన్స్ విభాగంలో ద్వితీయ బహుమతి తో పాటు నగదు బహుమతి ను కూడా అందుకుంది. లియాప్రసంగి, ప్రకృతి, రసగ్న, సుధీక్ష, లాస్య లతో కూడిన లియాప్రసంగి టీమ్అద్భుతమైన ప్రదర్శనతో జూనియర్ గ్రూప్ డాన్స్ విభాగంలో ద్వితీయ బహుమతి ను గెలుచుకుంది. నాట్య ప్రసంగి సబ్ జూనియర్ సోలో విభాగంలో ప్రత్యేక నృత్య ప్రదర్శన కు ఎంపికై అందరి ప్రశంసలు అందుకుంది.ఈ పోటీలు 2025 అక్టోబర్ 25న కరీంనగర్ కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అనేక బృందాలు, కళాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.అకాడమీ డైరెక్టర్ గజ్జెల ధర్మేందర్ విజేతలను అభినందిస్తూ, యువ కళాకారులు సాంస్కృతిక రంగంలో ప్రతిభను మరింత అభివృద్ధి చేసుకోవాలని ప్రోత్సహించారు. అదనంగా, న్యూ మిల్లేనియం స్కూల్, జమ్మికుంట చైర్మన్ మునిపట్ల తిరుపతి రెడ్డి మరియు ప్రిన్సిపాల్‌లు వరుణ్ రెడ్డి లియాప్రసంగి మరియు నాట్య ప్రసంగి బృందాలకు ఈ విజయంపై హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. వారు విద్యార్థుల కృషి, ప్రతిభ, మరియు సాంస్కృతిక చైతన్యాన్ని ప్రశంసిస్తూ, మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ప్రసంగి డాన్స్ స్టూడియో అండ్ ఫిట్‌నెస్ సెంటర్ ప్రొప్రైటర్ శ్రీలత , డాన్స్ మాస్టర్లు ప్రసంగి మరియు కే. రాజేష్ విద్యార్థులను ఈ అద్భుత విజయాలపై అభినందించారు. వారు విద్యార్థుల కష్టపడి సాధించిన ఫలితాన్ని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ప్రొప్రైటర్ మాట్లాడుతూ మన జమ్మికుంట ప్రాంతం నుండి రాష్ట్రస్థాయి నృత్య పోటీల్లో పాల్గొని విజయం సాధించడం ఎంతో గర్వకారణం. ఇటువంటి పోటీలు మన పట్టణానికి గౌరవాన్ని తెస్తాయి అని తెలిపారు.

# హాలో బహుజన ఛలో ఇందిరాపార్క్



**సామాన్యుడి అస్త్రం జనగామ :** నవంబర్ 1న జరిగే విశాల ధర్నా ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయండి బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేస్తారా లేదా మీ కుర్చీలను ఖాళీ చేయండి బహుజన్ సమాజ్ పార్టీ జనగామ జిల్లా అధ్యక్షులు మడిపడిగ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో గోడపత్రికల ఆవిష్కరణ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బీసీల హక్కుల సాధన కోసం,42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ,నవంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద విశాల ధర్నా ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము.ఈ కార్యక్రమాన్ని బహుజన సంఘాలు,విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మరియు కార్యకర్తలు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అంబేద్కర్ చౌరస్తాలోని గోడపత్రికల ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా నీర్మల రత్నం,జిల్లా ఇన్చార్జి జేరిపోతుల మల్లయ్య పాల్గొని హాలో బహుజన -ఛలో ఇందిరాపార్క్ అంటూ రాష్ట్రంలో జనాభా నిష్పత్తికి అనుగుణంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర జాప్యం చేస్తున్నాయని అన్నారు. బీసీల ఆశయాలను,ఆకాంక్షలను విస్మరించి,అధికారంలో ఉన్న పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలకే బీసీలను పరిమితం చేస్తున్నాయి.ఈ రిజర్వేషన్ల అమలు విషయంలో ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో,బహుజనులు తమ హక్కుల కోసం వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఆనాడు బిఎస్పీ వ్యవస్థాపకులు మాన్య శ్రీ కాన్షీరామ్ మండల్ కమిషన్ రిపోర్ట్ ను తక్షణమే అమలు చేస్తారా లేదా మీ కుర్చీలను ఖాళీ చేయండి అనే నినాదంతో పోరాటం 48రోజులపాటు న్యూఢిల్లీలో భారీ ధర్నా చేయడం ద్వారా బీసీలకు 27శాతం రిజర్వేషన్స్ అమలాయ్యాయని వారు గుర్తుచేశారు.మాన్యవర్ కాన్షీరామ్ స్ఫూర్తితో వారు గోంతేతినా నినాదంతోనే ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లను సాధించే వరకు పోరాటం చేస్తుందని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులు నారబోయిన రాజు ముదిరాజ్,జిల్లా ఈసీ మెంబర్ తాండ్ర లావణ్య,జనగామ నియోజకవర్గం అధ్యక్షురాలు గంధమాల నవనీత, స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గ అధ్యక్షులు జలగం ప్రవీణ్,నాయకులు చిలుముల అర్జున్,తాండ్ర సిద్ధులు,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

## భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం 12000 వేలు వారి ఖాతాలో జమ చేయాలి

**మున్సిపల్ కేంద్రంలో ఉపాధి పని కల్పించి జాబ్ కార్డులు- ఇచ్చి 200 పని దినాలు కల్పించాలి**



**సామాన్యుడి అస్త్రం జనగామ :** గొల్లపల్లి నాగయ్య వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జనగామ: జనగామ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో మంగళవారం గంగాపురం మహేందర్ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొల్లపల్లి నాగయ్య హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం ఇల్లు లేని వారికి ఇల్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పటేల్ గూడెం లో బచ్చన్నపేటలో జనగామ పట్టణంలో గుడిసెలు వేసిన వారికి ఇందిరమ్మ ఇండ్ల ఇచ్చి ఇల్లు కట్టించాలని అన్నారు. మహిళలకు మహాలక్ష్మి పేరుతో 2500 ఇవ్వాలని పెళ్లి కానుక తులం బంగారం ఇవ్వాలని భూమిలేని నిరుపేదలకు ప్రభుత్వ విచ్చిన మాట ప్రకారంగా 12 వేల రూపాయలు అకౌంట్ లో జమ చేస్తానని రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకు జమ చేయకపోవడం ఆంతర్యం ఏమిటి అని వారు ప్రశ్నించారు. ఉపాధి హామీలో రోజుకు 600 ఇవ్వాలని సంవత్సరానికి ?200 పని దినాలు కల్పించాలని మున్సిపల్ కేంద్రాలలో ఉపాధి హామీ పని కల్పించి వారికి జాబ్ కార్డులు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి జనగామ జిల్లా సింగారపు రమేష్ జిల్లా కమిటీ సభ్యులు పోతుకునూరి ఉపేందర్ గోసంగి శంకరయ్య సోమసత్యం వడ్లకొండ సుధాకర్ ఇంజ ఎల్లయ్య రాములు సంపూర్ణ పద్మ బాబు రాజు తదితరులు పాల్గొన్నారు

## జర్నలిస్ట్ లకు విరాహత్ అలీ క్షమాపణ చెప్పాలి

**-వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి**

**- టి డబ్ల్యూ జె ఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్**

**సామాన్యుడి అస్త్రం కరీంనగర్ :** హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఎన్నికల ఫలితాల తర్వాత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయి సహచర జర్నలిస్టులను ఉద్దేశించి టియుడబ్ల్యూజే అధ్యక్షుడు విరాహత్ అలీ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) తీవ్రంగా ఖండించింది. ఒక జర్నలిస్టు యూనియన్ కు అధ్యక్షుడుగా ఉండి తోటి జర్నలిస్టులను"విషసర్పాలని, బుడ్డర్ ఖాన్ లని, కొన్ని జర్నలిస్టు సంఘాలను బుడ్డ సంఘాలు అంటూ కించపర్చడం సరైంది కాదని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, వల్లాల జగన్, బండి విజయకుమార్, రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ తదితరులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విషసర్పాలన్నీ ఏకమై తమను ఏమీ చేయలేకపోయారంటూ సోషల్ మీడియాలో తెగ రెచ్చిపోయి మాట్లాడడం జర్నలిస్టులను బాధించినట్లని అన్నారు. ప్రెస్ క్లబ్ ఎన్నికల సందర్భంగా గెలుపు లక్ష్యంగా అందరూ అవగాహనతో లేదా కూటమిగా ఏర్పడి పోటీ చేయడం సర్వసాధారణం. అలాంటి పరిస్థితుల్లో ప్యానెల్ లో పోటీ చేసినా,స్వతంత్రంగా పోటీ చేసినా గెలుపు ఓటములు సహజమని, అంతమాత్రాన ఓడిపోయిన జర్నలిస్టులను ఉద్దేశించి విరాహత్ అలీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సహించరానిదని వారన్నారు. విరాహత్ అలీ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించు కోవాలని, సహచర జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ వల్ల జర్నలిస్టులకు ఒరిగిందేమిటో, జర్నలిస్టుల సంక్షేమానికి ఏం చేశారో చెప్పకుండా ఎన్నికల పేరుతో ఒక వర్గం, ఒక యూనియన్ పెత్తనంతో క్లబ్ ను తమ కబంధహస్తాల్లో పెట్టుకొని ఆటాడుతున్నారని ధ్వజమెత్తారు. మంచి వాతావరణంలో జరగాల్సిన ప్రెస్ క్లబ్ ఎన్నికలను గందరగోళం చేసి లక్షల రూపాయలు ఖర్చు పెట్టి రాజకీయం చేయడం, సభ్యులను తప్పుదోవ పట్టించడం బాధాకరమని అన్నారు. నిన్న జరిగిన ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు అభినందనలు తెలియజేస్తున్నామని, ఈ నూతన కార్యవర్గం రాబోయే రెండేళ్లలో ఏ ఒక్క రాజకీయ పార్టీకి గానీ,యూనియన్ కు గానీ లొంగకుండా ప్రెస్ క్లబ్ అభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు.

## తెలంగాణ బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ 3 వ జిల్లా మహాసభను జయప్రదం చేయండి



**సామాన్యుడి అస్త్రం జనగామ :** జోగు ప్రకాష్ ం తాండ్ర ఆనందం బిల్డింగ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ జనగామ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జనగామ : జనగామ జిల్లా కేంద్రంలో సిఐటియు కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక జిల్లా మహాసభ మంగళవారం ఉదయం 11:00 గంటలకు జయప్రదం చేయాలని భవనిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జోగు ప్రకాష్ తాండ్ర ఆనందం పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సమస్యలు పరిష్కారం కోసం మూడు సంవత్సరాల రాబోవు నిర్మాణం కోసం తదితర అంశాల పైన ఈ మహాసభ ఉంటుంది . తెలంగాణ ప్రభుత్వం భవన ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా 12 రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది ప్రమాద మరణం సహజ మరణం పూర్తి అంగవైకల్యం పక్షిక అంగవైకల్యం ఈ నాలుగు సంక్షేమ పథకాలను ప్రైవేటు భీమా కంపెనీలైన క్రెడిట్ యాక్సిస్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీకి 250 కోట్లు ఏర్గో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకి 94 కోట్లు ట్రయల్ బ్రేజర్ అనే బ్రోకర్ సంస్థ ద్వారా 12వ నెంబర్ జీవోను విడుదల చేసిన రెండవ రోజు 1996 చట్టవేదంగా కార్మికుల సొమ్ము 346 కోట్లు బదిలీ చేశారు అడ్వైజరి బోర్డు కమిటీ లేకుండా అధికారులే ఈ తథాంగం నడపడం చట్ట వ్యతిరేకం ప్రభుత్వ పెద్దలు కొంతమంది అధికారులు కుమ్మక్కై ప్రైవేట్ బీమా కంపెనీలకు దోచిపెట్టి నిర్ణయం చేశారు. ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డు ద్వారానే కార్మికులకు బెన్ఫిట్స్ అందించాలి 12 నంబర్ జీవోను సవరించి బీమా కంపెనీలకు ఇచ్చిన 346 కోట్లను తిరిగి బోర్డులో జమ చేయాలని వారు అన్నారు. భవన నిర్మాణ కార్మికుల కోసం సిఐటియు అనుబంధం భవనిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభ జరుగుతుంది ఈ మహాసభకు భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరి రాములు ముఖ్యఅతిథిగా వస్తున్నారు కావున జనగామ జిల్లా భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు అన్నారు

## జనగామ బర్డే ట్రీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ పుట్టినరోజు సందర్భంగా జనగామ పట్టణం లోని స్థానిక సంజయ్ నగర్ లోని భగత్ సింగ్ చౌక్ లో మొక్కలు నాటి ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు



**సామాన్యుడి అస్త్రం జనగామ :** జనగామ బర్డే ట్రీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ పుట్టినరోజు సందర్భంగా జనగామ పట్టణం లోని స్థానిక సంజయ్ నగర్ లోని భగత్ సింగ్ చౌక్ లో మొక్కలు నాటి ఘనంగా జన్మదిన వేడుకలు జరుపుకున్నారు ఈ సందర్భంగా జనగామ జిల్లా జనగామ అమ్మ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఈ రోజు అమ్మ ఫౌండేషన్ బర్డే ట్రీ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ పుట్టినరోజు సందర్భంగా భగత్ సింగ్ చౌక్ అమ్మ ఫౌండేషన్ ఆఫీస్ నందు మొక్కలు నాటి జరుపుకోవడం చాలా సంతోషమని ఇప్పుడున్న యువతకు ఆదర్శంగా జనగామ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆకలితో అలమటించే నిలువనీడ లెని నిరాశ్రయులకు అనాధలకు అభాగ్యులకు అండగా నిలుస్తూ అన్నదానం వస్త్ర దానం చేస్తూ యువతకు వారి యొక్క పుట్టినరోజు సందర్భంగా బర్త్ డే సందర్భంగా ఒక మొక్కలు నాటే విధంగా యువత ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చా పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా సామాజిక సేవా కార్యక్రమంలో ముందుండి నడిపిస్తున్న జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణి కుమార్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు జనగామ అమ్మ ఫౌండేషన్ టీం సభ్యులను అభినందించారు ఈ సేవా కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ టీమ్ సభ్యులు పండగ నరేష్,బోట్ల సాయి,సల్ల మహేష్,మద్దెల కార్తీక్,వెంపటి అజయ్,బింగి నర్సింహులు,చిక్కుడు నాగేష్,మహమ్మద్ అఫ్రోజ్,పల్లె హరీష్ నిరంజన్,కుమ్మరికుంట్ల హరికృష్ణ,గొల్లూరి చందు,కనకరాజ్, శ్రావణ్, క్రాంతి,అనీల్, మరియు తదితరులు పాల్గొన్నారు

# చందానగర్ గంగారం చెరువులో ఘనంగా ఛట్ పూజలు

**పాల్గొన్న పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ**



**సామాన్యుడి అస్త్రం, చందానగర్ :** చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం చెరువులో సోమవారం ఉత్తర భారతీయ ప్రజలు ఛట్ పూజలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం సూర్యాస్తమయ వేళ సూర్యదేవునికి నైవేద్యాలు సమర్పించి భక్తులు ప్రార్ధనలు చేశారు. ఈ వేడుకలకు పీఏసీ చైర్మన్, సేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ఛట్ పూజ ఉత్తర భారతీయుల అత్యంత పవిత్రమైన పండుగ. సూర్యభగవానుడికి కృతజ్ఞతగా నిర్వహించే ఈ పూజ బీహార్, జార?ండ్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్గఢ్ వంటి రాష్ట్రాల్లో విస్తృతంగా జరుపుకుంటారు," అని తెలిపారు. భూమిపై మనుగడకు మూలమైన సూర్యుడికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయురారోగ్య, ఆనందాల కోసం ప్రార్థించడం ఈ పూజ ప్రత్యేకతగా పేర్కొన్నారు. సూర్యారాధన ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు కూడా తగ్గుతాయని ఆయన చెప్పారు. పవిత్ర జలాల్లో పుణ్యస్నానం చేసి సూర్యభగవానుని ఆరాధించిన భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మియాపూర్ గురునాథం చెరువు వద్ద ఘనంగా చట్ పూజలు



**సామాన్యుడి అస్త్రం, మియాపూర్ :** ఉత్తర భారతీయ రాష్ట్రాలకు చెందిన ప్రజలు సోమవారం మియాపూర్ డివిజన్ పరిధిలోని గురునాథం చెరువు వద్ద చట్ పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే అరికపూడి గాంధీ,మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ లు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత పవిత్రంగా కొలిచే గొప్ప పండుగ ఛట్ పూజ అని , బీహార్, జార?ండ్ మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్గఢ్, చండీగఢ్, గుజరాత్, గయ, రాంచీ, ఢిల్లీ, ముంబై తదితర ప్రాంతాల్లో ప్రముఖంగా కార్తీకమాసంలో జరుపుకునే పూజ ఛట్ పూజ అని తెలిపారు. భూమ్మీద తమకు మనుగడ కల్పిస్తున్న సూర్యభగవానుడికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ, ఆయురారోగ్య, ఆనందాలను ప్రసాదించమని ప్రార్థిస్తారు. సూర్యుని ఆరాధించడంవల్ల కుష్టు వంటి దీర్ఘకాలిక వ్యాధులు కూడా నయమౌతాయని నమ్ముతారు. పవిత్ర నదిలో పుణ్యస్నానం చేసి నీటిలో వీలైనంత ఎక్కువసేపు నిలబడి సూర్యభగవానుని ఆరాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ,కార్యకర్తలు, మరియు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీస్ విధులు ఉండాలి







**ప్రజలకు సత్వర న్యాయం, విజిబుల్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి సారించాలి**

**కోరుట్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**కోరుట్ల :** ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీస్ విధులు ఉండాలని,ప్రతి ఫిర్యాదుపై తక్షణం స్పందించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు.సోమవారంవార్షిక తనిఖీల్లో భాగంగా కోరుట్ల పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ స్టేషన్‌లోని వివిధ విభాగాలు, రికార్డులు, రిజిస్టర్లు, క్రైమ్ రికార్డులు, జనరల్ డైరీ, ఆర్మ్ రూమ్, స్టోర్స్, లాకప్ రూమ్‌లను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను రివ్యూ చేసి, విచారణలో ఉన్న కేసుల పురోగతిపై సమీక్ష జరిపారు. స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితులు, నేరాల స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు.ఆనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువయ్యేలా పోలీస్ విధులు ఉండాలని, ప్రతి ఫిర్యాదుపై తక్షణం స్పందించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంతో పోల్చుకుంటే నేరాల రేటు తగ్గుముఖం పట్టిందని ప్రజలు పోలీసులపై విశ్వా సం ఉంచి అసాంఘిక కార్యకలాపాలు గమనించిన వెంటనే సమాచారం అందించాలని సూచించారు.అలాగే మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల వ్యసన నిర్మూలన, యువతలో చట్టం పట్ల గౌరవం పెంపొం దిం చేందుకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. కేసుల విచారణలో స్పీడ్ ఇన్వెస్టిగేషన్, సాక్ష్యాల సేకరణలో నిష్పక్షపా త దృక్పథం అవసరమని సూచించారు. పోలీస్ స్టేషన్ అధికా రులు, సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని అభినందిం చారు. ఈ సందర్భంగా రిసెప్షన్ వర్టికల్ నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు ను పిటిషన్ మేనేజ్మెంట్లో ఎంట్రీ చేసిన డాటా ను తనిఖీ చేశారు. రిసెప్షన్ఈస్ట్ గా ప్రతి దరఖాస్తు పై తప్పని సరిగా పిటిషన్ మేనేజ్మెంట్ లో జనరేట్ చేసినా రిసిప్ట్ ఇవ్వా లని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో 5 ఎస్ విధానాన్ని పాటిస్తూ పరిశుభ్రంగా ఉండేటట్లు అదేవిధంగా ఫైల్స్, క్రమపద్ధతిలో నిర్దేశిత ప్రదేశాల్లో ఉండేటట్లు చూసుకోవాలని సూచించారు.అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ... పోలీస్ స్టేషన్ అంతా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ఉంటూ విధి నిర్వహణలో క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. పోలీస్ శాఖ నూతన టెక్నాలజీ అధునాతన టెక్నాలజీ ఉపయోగిస్తున్న దాని గురించి అధికారులకు సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. సిబ్బంది కి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకొని రావాలి అని సూచించారు.తనిఖీ అనంతరం ఎస్పీ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. పచ్చదనం, పరిశుభ్రతపై ప్రతి పోలీస్ సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ రాములు ,డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కోరుట్ల, మెట్ పల్లి సి.ఐ సురేష్, అనిల్ కుమార్, ఎస్సై లు చిరంజీవి, రామచందర్, శ్రీధర్ రెడ్డి, నవీన్, కిరణ్ కుమార్, రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

**అర్జీదారుల సమస్యలపై వినతులు స్వీకరించిన జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత**

**ప్రజావాణి ఫిర్యాదుల సంఖ్య 32**



**జగిత్యాల :** ప్రజావాణి అర్జీల పై సమగ్ర విచారణ జరిపి సమస్యలను పరిష్కరించాలని అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్ లత అదేశించారు.సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను ఆర్డీఓలతో తో కలిసి అదనపు కలెక్టర్ బి.ఎస్ లత స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పలు సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాలనుండి ప్రజలు సమస్యలు విన్నవించుకోడానికి ప్రజావాణికి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరిం చాలని అధికారులను ఆదేశించారు. కాగా ఈరోజు నిర్వహిం చిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 32 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల, మెట్ పల్లి, కోరుట్ల ఆర్డీఓలు మధు సూధన్, శ్రీనివాస్,జీవాకర్ రెడ్డి , శిక్షణ డిప్యూటీ కలెక్టర్ కన్నం హరిణి,వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు,కలెక్టరేట్ పర్యవేక్షకులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బెస్ట్ యాక్టర్స్ మరియు బెస్ట్ సోషల్ యాక్టివిస్ట్ నంది అవార్డు అందుకున్న జీవన్ గ్రీన్ హెూప్ సొసైటీ చైర్మన్ దూసరి ధనలక్ష్మి శ్రీకాంత్







**సామాన్యుడి అస్త్రం జనగామ :** బెస్ట్ యాక్టర్స్ మరియు బెస్ట్ సోషల్ యాక్టివిస్ట్ అవార్డులు అందుకోవడం నా జీవితంలో ఒక ప్రత్యేకమైన క్షణం. బుల్లితెరపై, వెండితెరపై నా నటనకు లభించిన గుర్తింపుతో పాటు, సమాజసేవలో చేసిన చిన్న ప్రయత్నాలకు వచ్చిన ఈ గౌరవం నాకు ఎంతో ప్రోత్సాహాన్నిస్తుంది. నా పక్కన నిలిచిన ప్రతి ఒక్కరికి, జీవన్ గ్రీన్ హెూప్ సొసైటీ సభ్యులకు, మా జనగామ ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు. నా కుటుంబానికి, అభిమానులకు, జీవన్ గ్రీన్ హెూప్ సొసైటీ సభ్యులకు, మరియు ఎల్లప్పుడూ నన్ను విశ్వసించి ప్రోత్సహించే అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ అవార్డులు నా కృషికి గుర్తింపు మాత్రమే కాదు మరింత బాధ్యతతో ముందుకు సాగాలని గుర్తు చేసే శక్తి కూడా.శ్రీమతి దూసరి ధనలక్ష్మి శ్రీకాంత్ బెస్ట్ యాక్టర్స్ మరియు బెస్ట్ సోషల్ యాక్టివిస్ట్ నంది అవార్డు చైర్ పర్సన్ జీవన్ గ్రీన్ హెూప్ సొసైటీ

## నెల్లుట్లలో రోడ్డు ప్రమాదం యువకుడు మృతి



**సామాన్యుడి అస్త్రం జనగామ :** నెల్లుట్లలో రోడ్డు ప్రమాదం..యువకుడు మృతి బైకు, లారీ ఢీకొన్న ఘటన లింగాల ఘనపురం మండలం నెల్లుట్ల ఆర్టీసీ కాలనీ వద్ద చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో బైకుపై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకుల్లో ఒకరు అక్కడికక్కడే మరణించగా ఇంకొకరి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. 108కు, పోలీసులకు సమాచారం అందించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షురాలుగా చెరుకూరి మౌనిక యాదవ్



**సామాన్యుడి అస్త్రం జనగామ :** బీసీల రాజ్యాధికారం కోసం ఏర్పడిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ జనగామ జిల్లా అధ్యక్షురాలుగా నన్ను నియమించినందుకు పార్టీ అధ్యక్షులు తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్సీ కి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్స్ సుదగాని హరి శంకర్ గౌడ్, మాదం రజిని కుమార్ యాదవ్ లకు, పార్టీ ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ మరియు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్ పల్లెబోయిన అశోక్ ముదిరాజ్ మరియు తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యవర్గానికి మరియు ఎన్నికకు సహకరించిన శ్రేయోభిలాషులందరికీ ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా నాపై నమ్మకంతో ఇచ్చిన ఈ పదవిని బాధ్యతగా స్వీకరిస్తూ పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ బీసీల రాజ్యాధికారం మరియు సామాజిక తెలంగాణ నిర్మాణం కోసం అందరితో మమేకమై ప్రతి ఒక్కరిని కలుపుకొని శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు

## ప్రజావాణి ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోండి :

**డీసీ శశిరేఖ**




**సామాన్యుడి అస్త్రం, చందానగర్ :** చందానగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 20 ఫిర్యాదులు స్వీకరించారని అధికారులు తెలిపారు. వీటిలో ఇంజినీరింగ్ విభాగానికి 3, టౌన్ ప్లానింగ్‌కు 7, రెవెన్యూ శాఖకు 5, విద్యుత్ శాఖకు 1, యూబీడీకి 2, ఏఎంఓహెచ్ విభాగానికి 2 ఫిర్యాదులు అందాయని వివరించారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదును తక్షణమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులను డిప్యూటీ కమిషనర్ శశిరేఖ ఆదేశించారు. ప్రజా సమస్యలను ఆలస్యం చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ నాగిరెడ్డి, ఏఎంఓహెచ్ కేవీస్ రవి, ఇతర అధికారులు శ్రీదేవి, చిన్న, సమీర, లక్ష్మీ ప్రియతో పాటు పలువురు ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలకు భారీ నిధుల మంజూరుపై ప్రముఖుల ఫోటోలకు పాలాభిషేకం

**కోరుట్ల :** కోరుట్ల మున్సిపాలిటీకి యూఐడిఎఫ్ పథకంలో భాగంగా 18 కొట్ల 70 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయడం పట్ల సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు తిరుమల గంగాధర్ అధ్యక్షతన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున కార్గే ,కాంగ్రెస్ పార్టీ యువ నేత రాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు, రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ కోరుట్ల మున్సిపాలిటీ లోనే 33 వార్డుల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం 18 కోట్ల 70 లక్షల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు .ఇట్టి నిధులను వార్డుల అభివృద్ధి కోసం వినియోగించాలని అధికారులను కోరినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ, ఏఆర్ అక్బర్, లక్ష్మణ్ ,వసీం,నర్సయ్య లక్ష్మణ్, వాసిద్, తెడ్డు విజయ్, రాజు, శ్రీ వెంకటేశ్వర దేవాలయ అధ్యక్షులు ఎతిరాజం నర్సయ్య, కటుకం దివాకర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు




# సూర్య-46 మూవీలోకి స్టార్ బ్యూటీ ఎంట్రీ

స్టార్ హీరో సూర్య, డైరెక్టర్ ఆర్.జే. బాలాజీ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ మూవీ 'కరుప్పు'. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది. ఇక దీంతో పాటు తెలుగులో వెంకీ అట్లూరి దర్శకత్వంలో మరో మూవీ చేయబోతున్న విషయం తెలిసిందే. 'సూర్య-46'అనే వర్కింట్ టైటిల్‌తో రూపొందుతోన్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్‌పై నాగవంశీ నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమాకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. వచ్చే ఏడాది షూటింగ్ స్టార్ట్ కాబోతున్న ఈ చిత్రంలో తాజాగా ఓ స్టార్ బ్యూటీ కూడా యాడ్ అయినట్లు ఇచ్చారు మేకర్స్. ఇందులో రవీన్ టండన్ కూడా భాగం కాబోతున్నట్లు తెలుపుతూ.. 'ఎవర్ గ్రీన్ రవీన్ టండన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. ాబతీఞఖ46 లోకి మిమ్మల్ని చేర్చుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది. మీతో ముందు ముందు ఉండబోయే అద్భుతమైన ప్రయాణం కోసం వేచి చూస్తున్నాము' అని తెలిపారు.

# నయనతారకు మరో ఆఫర్!



నందమూరి బాలయ్య ఏడాదికి రెండు సినిమాలు చేసుకుంటూ ముందుకు దూసుకు వెళ్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అఖండ 2 సినిమాతో ఫుల్ బిజీగా ఉన్న నందమూరి బాలయ్య, మరో నెలలో కొత్త సినిమా ప్రారంభించనున్నారు.గోపీచంద్ మలినేనితో మరో సినిమా తీసేందుకు బాలయ్య సిద్ధమయ్యారు. 111 అనే వర్కింగ్ టైటిల్ తో వస్తున్న ఈ సినిమా నవంబర్ ఏడో తేదీన పూజా కార్యక్రమాలతో షూటింగ్ ప్రారంభించుకోబోతున్నట్లు టాక్. ఇప్పటికే బాలయ్య-గోపీచంద్ మలినేని కాంబినేషన్ లో వీరసింహారెడ్డి సినిమా వచ్చి సక్సెస్ అయింది. దీంతో మరోసారి గోపీచంద్ కు ఛాన్స్ ఇచ్చాడు నందమూరి బాలయ్య. ఇక ఈసారి మాస్ యాక్షన్ అంశాలతో పాటు రెండు కాలాలకు సంబంధించిన హిస్టారికల్ కథను గోపీచంద్ మలినేని సిద్ధం చేశాడట. టైం ట్రావెల్ లాంటి కథ అని చెబుతున్నారు. ఇందులో కూడా నందమూరి బాలయ్య డబుల్ రోల్ లో కనిపించే ఛాన్సులు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో ఈ సినిమా నుంచి మరో గాసిప్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ మూవీలో నయనతార హీరోయిన్ గా ఫైనల్ అయినట్లు చెబుతున్నారు. ఇప్పటికే బాలయ్యతో నయనతార చాలా అనే సినిమాలు తీశారు. హిస్టారికల్ కథ కావడంతో బాలయ్య సరసన నయనతార అయితేనే కరెక్ట్ గా ఉంటుందని గోపీచంద్ ఈ నిర్ణయం తీసుకున్నాడట. రెమ్యూనరేషన్ ఎంతైనా ఇచ్చేందుకు చిత్ర బృందం సిద్ధం అయిందని టాక్ వినిపిస్తోంది.



# పరిచయం నుంచి పరిణయం వరకు..

విష్ణు విశాల్ నటిస్తున్న ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'ఆర్యన్'. ప్రవీణ్ కె దర్శకత్వంలో విష్ణు విశాల్ స్టూడియోజ్, శుభ్రా, ఆర్యన్ రమేష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన టీజర్, ట్రైలర్ మంచి బజ్ క్రియేట్ చేశాయి. ఫస్ట్ సింగిల్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ఇప్పుడు మేకర్స్ 'పరిచయమే..' సాంగ్ రిలీజ్. జిబ్రాన్ ఈ సాంగ్‌ని బ్యూటీఫుల్ లవ్ మెలోడీగా కంపోజ్ చేశారు. సామ్రాట్ అందించిన లిరిక్స్ అందర్నీ అలరిస్తున్నాయి. జిబ్రాన్, అభివి, భృత్త వోకల్స్ లవ్లీ ఫీల్‌ని యాడ్ చేశాయి. ఈ సాంగ్‌లో లీడ్ పెయిర్ జర్నీ హత్తుకునేలా ఉంది. సెల్వరాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో విష్ణు విశాల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. సాయి రోనక్, తారక్ పొన్నప్ప, మాల పార్వతి, అవినాష్, అభిషేక్ జోసెఫ్ జార్జ్ సహాయక పాత్రల్లో నటిస్తున్నారు. విష్ణు విశాల్ 'ఎఫ్ఐఆర్' చిత్రానికి దర్శకత్వం వహించిన మను ఆనంద్ ఈ చిత్రానికి సహ రచయితగా పనిచేశారు. 'ఆర్యన్' ఈనెల 31న విడుదల కానుంది.

# టీమిండియాతో టెస్టు సిరీస్‌కు సౌతాఫ్రికా జట్టు ప్రకటన

టీమిండియాతో టెస్టు సిరీస్ కు సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు తమ జట్టును ప్రకటించింది. తమ కెప్టెన్ తెంబా బవుమా గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడని.. భారత్‌లో సఫారీ జట్టుకు సారథ్యం వహించనున్నట్లు తెలిపింది. ఈ మేరకు బవుమా కెప్టెన్సీలో టీమిండియాతో టెస్టులు ఆడబోయే జట్టులో పదిహేను మందికి చోటు ఇచ్చినట్లు సోమవారం వెల్లడించింది.



**భారత్‌తో రెండు టెస్టులు**

ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2025-27 సీజన్‌లో భాగంగా సౌతాఫ్రికా టీమిండియాతో రెండు టెస్టుల్లో తలపడనుంది. భారత్ వేదికగా జరిగే ఈ సిరీస్ నిర్వహణకు నవంబరు 14-26 వరకు షెడ్యూల్ ఖరారైంది. ఈ నేపథ్యంలో ఇందుకు సంబంధించిన జట్టును ప్రొటిస్ బోర్డు తాజాగా ప్రకటించింది. ఇటీవల పాకిస్తాన్‌లో పర్యటించిన జట్టులో స్వల్ప మార్పుల తోనే టీమిండియాతోనూ సఫారీలు బరిలో దిగనున్నారు. బవుమా తిరిగి రావడంతో డేవిడ్ బెడింగ్‌హామ్ జట్టులో చోటు కోల్పోయాడు. కాగా పాక్‌తో ఇటీవల సౌతాఫ్రికా జట్టు రెండు టెస్టులు ఆడింది.

**పాక్‌తో టెస్టు సిరీస్ సమం**

బవుమా గైర్హాజరీలో ఐడెన్ మార్క్రమ్ సారథ్యంలో డబ్ల్యూటీసీ డిఫెండింగ్ చాంపియన్ హోదాలో బరిలో దిగిన సౌతాఫ్రికా.. అనూహ్య రీతిలో పాక్‌తో తొలి టెస్టులో ఓడింది. ఆ తర్వాత రావల్పిండి వేదికగా రెండో టెస్టు గెలిచి సిరీస్‌ను 1-1 సమం చేయగలిగింది. తదుపరి పాక్‌తో మూడు టీ20లు, మూడు వన్డేలు ఆడిన తర్వాత సౌతాఫ్రికా జట్టు భారత పర్యటనకు రానుంది. ఈ టూర్‌లో భాగంగా టీమిండియాతో తొలుత రెండు టెస్టులు ఆడనున్న సఫారీలు.. తదుపరి మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్‌లు ఆడనున్నారు.

**విండీస్‌ను వైట్‌వాష్ చేసిన టీమిండియా**

ఇదిలా ఉంటే.. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న టీమిండియా వన్డే సిరీస్‌లో ఆతిథ్య జట్టు చేతిలో 2-1తో ఓటమి చవిచూసింది. తదుపరి ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ పూర్తి చేసుకుని.. స్వదేశంలో సౌతాఫ్రికాతో తలపడనుంది. ఇక డబ్ల్యూటీసీ తాజా సీజన్‌లో గిల్ సేన తొలుత ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా ఐదు టెస్టుల సిరీస్‌ను 2-2తో సమం చేసింది. ఆ తర్వాత స్వదేశంలో వెస్టిండీస్‌ను 2-0తో వైట్‌వాష్ చేసి జోరు మీదుంది.

**టీమిండియాతో టెస్టులకు సౌతాఫ్రికా జట్టు ఇదే**

తెంబా బవుమా (కెప్టెన్), ఐడెన్ మార్క్రమ్, రియాన్ రికెల్టన్, ట్రిస్టన్ స్టబ్స్, కైలీ వెరెన్నె, డెవాల్డ్ బ్రెవిస్, జుబేర్ హంజా, టోనీ డీ జోర్జి, కార్బిన్ బాష్, వియాన్ ముల్డర్, మార్కో యాన్సెన్, కేశవ్ మహరాజ్, సెనురాన్ ముత్తుస్వామి, కగిసో రబడ, సైమన్ హార్మర్.

## ఐసీయూ నుంచి వార్డుకు.. నిలకడగానే అయ్యర్ అరోగ్యం..!



సిడ్నీ వన్డేలో క్యాచ్ అందుకునే క్రమంలో గాయపడిన శ్రేయస్ అయ్యర్ కోలుకుంటున్నాడు. రెండు రోజులుగా వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్న అయ్యర్‌ను.. సోమవారం ఐసీయూ నుంచి స్పెషల్ వార్డుకు మార్చారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగానే ఉందని డాక్టర్లు చెప్పారు. అయితే.. అస్పత్రిలోనే మరో రెండు మూడు రోజులు ఉండాల్సి వస్తుందని తెలిపారు. వైస్ కెప్టెన్ అయిన అయ్యర్.. పూర్తిగా కోలుకునేందుకు మూడు వారాలకు పైగా సమయం పట్టనుందని సమాచారం. 'మూడో వన్డేలో ఫీల్డింగ్ చేస్తూ.. క్యాచ్ అందుకుంటున్న సమయంలో అయ్యర్‌కు గాయమైంది. ఎడమవైపు పొత్తకడుపు కింది భాగంలో అతడి మోచేయి బలంగా తాకింది. దాంతో.. నొప్పితో విలవిల్లాడిన అతడిని ఫిజియో పరీక్షించారు. అయి నా అయ్యర్ ఇబ్బందిపడుతూనే ఉండడంతో ఆసల్యం చేయ కుండా ఆస్పత్రిలో చేర్పించారు. స్కానింగ్ పరీక్షల్లో అతడికి ప్లీహం భాగంలో గాయం అయినట్టు గుర్తించాం. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగానే ఉంది. వేగంగా కోలుకుంటున్నాడు. బీసీసీఐ వైద్యబృందం అయ్యర్ అరోగ్యాన్ని అను క్షణం పర్యవేక్షిస్తోంది. అతడి ఆరోగ్యంలో రోజూవారీ పురో గతిని గమనించేందుకు టీమిండియా డాక్టర్ సిడ్నీలోనే ఉండ నున్నాడు' అని బీసీసీఐ ఒక ప్రకనటలో వెల్లడించింది. అంతే కాదు అయ్యర్‌కు అండగా కొందరు స్నేహితులు ఉన్నా రని.. వీసా ప్రక్రియ పూర్తికాగానే అతడి కుటుంబసభ్యులు కూడా సిడ్నీ చేరుకుంటారని బీసీసీఐ తెలిపింది. మూడో వన్డేలో హర్షిత్ రానా ఓవర్లో అలెక్స్ క్యారీ థర్డ్‌మ్యాన్ దిశలో కొట్టిన బంతిని అయ్యర్ డైవ్ చేస్తూ అందుకున్నాడు. సూపర్ క్యాచ్ పట్టిన అతడు.. ఆ తర్వాత ఎడమవైపు పక్కటెముల నొప్పితో విలవిల్లాడాడు. దాంతో, ఫీజియో వచ్చి పరీక్షిం చాడు.. అయినా ఉపశమనంగా లేకపోవడంతో అయ్యర్ బాధపడు తూనే డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లిపోయాడు. అతడికి స్కానింగ్ పరీక్షలు జరిపిన వైద్యలు.. పెద్ద ప్రమాదమేమీ లేదని తేల్చడంతో భారత మేనేజ్‌మెంట్, అభిమానులు ఊపిరిపీల్చు కున్నారు. నవంబర్ ఆఖర్లో దక్షిణాఫ్రికాతో జరుగబోయే మూడు వన్డేల సిరీస్ లోపు అయ్యర్ కోలుకునే అవకాశ ముంది. స్వదేశంలో నవంబర్ 30, డిసెంబర్ 3, డిసెంబర్ 6వ తేదీన సఫారీ టీమ్‌తో టీమిండియా తలపడనుంది

# స్పోర్ట్స్

## టీమిండియాకు భారీ షాక్.. ప్రపంచకప్ నుంచి ఓపెనర్ ప్రతీక ఔట్!



మహిళల వన్డే వరల్డ్ కప్‌ను పట్టేయాలనే కసితో ఉన్న భారత జట్టుకు భారీ షాక్. ఫామ్‌లో ఉన్న స్టార్ ఓపెనర్ ప్రతీకా రావల్ అనూహ్యంగా టోర్నీ నుంచి నిష్క్రమించింది. బంగ్లాదేశ్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో ఫీల్డింగ్ చేస్తూ.. బౌండరీ లైన్ వద్ద బంతిని ఆపే క్రమంలో గాయపడిన తనకు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. దాంతో.. కీలకమైన ఆస్ట్రేలియా మ్యాచ్‌కు ఆమె అందుబాటులో ఉంటుందని ఆశించిన హర్మన్‌ప్రీత్ సేనకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్టైంది. అసలేం జరిగిందంటే..? డీవై పాటిల్ స్టేడియంలో ఆదివారం వర్షం అంతరాయంతో 27 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ కీలక వికెట్లు కోల్పోయింది. అయితే.. శోభన మోస్త్రే (26) కీలక ఇన్నింగ్స్ ఆడింది. రాధా యాదవ్ వేసిన 21వ ఓవర్లో రెండు ఫోర్లు కొట్టిన శోభన.. చివరి బంతిని మిడాఫ్‌లో బలంగా కొట్టింది. బౌండరీ వెళ్లకుండా బంతిని ఆపబోయిన ప్రతీక.. కొంచెం ముందుకు వెళ్లింది. తిరిగి వెనక్కి వచ్చే క్రమంలో ఆమె షూ స్పైక్స్ గడ్డిలో ఇరుక్కోవడంతో.. కిందపడిపోయింది. ఎడమ కాలిమడిమ మడతపడంతో నొప్పిని భరించలేకపోయింది ప్రతీక. నడవడానికి ఇబ్బంది పడిన ఆమెను సహచరులు డ్రెస్సింగ్ రూమ్‌కు తీసుకెళ్లారు. అయితే.. బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ ముగిసినా బ్యాటింగ్‌కు రాలేదు. దాంతో.. స్మృతిమంధానతో కలిసి అమన్‌జోత్ కౌర్ ఇన్నింగ్స్ ఆరంభించింది.

**మంధానతో పోటీగా**

వర్షం కారణంగా మ్యాచ్ రద్దయినా ప్రతీక ఆరోగ్యం గురించి బీసీసీఐగానీ, కోచ్ మజుందార్‌గానీ ఎలాంటి ప్రకటన చేయలేదు. దాంతో.. కీలకమైన సెమీస్ పోరులో ఆమె ఆడడంపై సోమవారం స్పష్టత వస్తుందని ఆశించారంతా. కానీ, భారత జట్టుకు, అభిమానులకు షాకిస్తూ..తను టోర్నీ నుంచి వైదొలిగింది. నిరుడు డిసెంబర్‌లో వన్డేల్లో అరంగేట్రం చేసిన ప్రతీక ఓపెనర్‌గా స్థిరపడిపోయింది. చాపకింద నీరులా ఇన్నింగ్స్ నిర్మించే తను.. ఆఖర్లో పవర్‌ఫుల్ షాట్లతో విరుచుకుపడుతూ వరల్డ్ కప్‌లో అదరగొట్టింది. స్మృతి మంధానతో కలిసి పోటీగా ఆడుతూ శుభారంభాలు ఇచ్చిన ప్రతీక.. మెగా టోర్నీలో ఆడిన ఆరు మ్యాచుల్లో ఒక శతకం, హాఫ్ సెంచరీలతో కలిపి 308 రన్స్‌తో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించింది. లీగ్ దశలో విశాఖపట్టణంలో ఆస్ట్రేలియాపై అర్ధ శతకంతో చెలరేగిన ప్రతీక సెమీస్‌లోనూ చెలరేగిపోవాలని భావించింది. స్మృతి, తను దంచేస్తే టీమిండియాకు తిరుగుండదని అభిమానులు ఆశించారు. కానీ, లీగ్ దశ చివరి మ్యాచ్‌లో అనుకోని గాయం ప్రతీక తొలి వరల్డ్ కప్ ఆశలను ఆవిరి చేసేసేంది. ఇప్పుడు టేబుల్ టాపర్ ఆస్ట్రేలియాతో గురువారం సెమీఫైనల్ పోరులో మంధానకు జోడీగా ఇన్నింగ్స్ ఆరంభించేందుకు ఎవరిని పంపాలి? అనేది భారత కోచ్, కెప్టెన్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. బంగ్లాపై ఫర్వాలేదనిపించిన అమన్‌జోత్‌నే కొనసాగించాలా? మరెవరినైనా పంపాలా? అనే విషయంపై గురువారంకల్లా స్పష్టత రానుంది.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.